సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శుక్రవారం, 11.09.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 312
పేజీలు: 08 వెల: రూ. 5

మైనర్ల సోషల్ మీడియా వాడకంపై

# కేంద్రానికి నోటీసులు

భారత్‌లో పటిష్ఠమైన రక్షణ అవసరమన్న సుప్రీంకోర్టు

- మైనర్లు సోషల్ మీడియా ఖాతాలు తెరవకుండా నిషేధించాలని సుప్రీంకోర్టులో పిటిషన్
- కాంట్రాక్ట్ చట్టం ప్రకారం మైనర్లు ఒప్పందాలు చేసుకోలేరని పిటిషనర్ వాదన
- పిటిషన్‌పై స్పందించాలని కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

02



# సెక్రటేరియట్‌లోనే లంచం!

ఏసీబీ చేతికి చిక్కిన ఉద్యోగి

- సచివాలయంలో రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఉద్యోగి
- సీఎంఆర్ఎఫ్ చెక్కు కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు
- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ అధికారులు
- సచివాలయ దేవాలయం వద్ద డబ్బులు తీసుకుంటుండగా పట్టివేత
- లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు

02



# పేదల ఆత్మగౌరవమే లక్ష్యం

ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల ఉచిత సాయం దేశంలో ఎక్కడా లేదు

- రెండో విడతలో 59 వేల గుడిసెల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు
- ఏ నియోజకవర్గంలోని పేదలకు అక్కడే ఇళ్లు
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టీకరణ

03



# కేటీఆర్, హరీశ్ రావుపై కేసు

లైంగిక వేధింపుల కేసు

- మహిళా పోలీసులతో దురుసు ప్రవర్తన ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు
- కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఎఫ్ఐఆర్
- అసెంబ్లీ వద్ద చొక్కాలు విప్పి ఇబ్బంది పెట్టారని మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు
- భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు

02





## టార్గెట్ రేవంత్

# ఫ్యామిలీ

## ఫ్యూచర్ సిటీపై గులాబీ దండయాత్ర

### సస్పెన్షన్‌కు బీఆర్ఎస్ కౌంటర్..

- తుక్కుగూడ, రావిర్యాలలో కేటీఆర్–హరీష్ రావు క్షేత్రస్థాయి పరిశీలన
- భూకేటాయింపుల్లో అక్రమాలంటూ కాంగ్రెస్ సర్కార్‌పై ఆరోపణలు..
- రేవంత్ కుటుంబానికి లబ్ధి చేకూరుస్తున్నారంటూ ధ్వజం



**ముద్ర డెస్క్:**
తెలంగాణ అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌తో రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి. సభలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గులాబీ పార్టీ.. ఇప్పుడు తన పోరాటాన్ని నేరుగా ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రచారం చేస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు పరిధిలో భూకేటాయింపులపై బీఆర్ఎస్ అగ్రనేతలు తీవ్ర ఆరోపణలు చేస్తూ రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడ, రావిర్యాల ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు.
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలో సస్పెండ్ అయిన ఎమ్మెల్యేల బృందం తుక్కుగూడలోని టెస్సెరాక్ట్ ఆవరణకు చేరుకుని అక్కడి భూములను పరిశీలించింది. ఫ్యూచర్ సిటీ పేరుతో అత్యంత విలువైన భూముల కేటాయింపుల్లో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని నేతలు ఆరోపించారు.

**'వేల కోట్ల భూములు దారాదత్తం'**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రయోజనం చేకూరేలా భూకేటాయింపులు జరిగాయని కేటీఆర్, హరీష్ రావు ఆరోపించారు. ప్రజా ప్రయోజనాల పేరుతో భూములను సేకరించి, అనంతరం ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. తుక్కుగూడ, రావిర్యాల ప్రాంతాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన జీవోలు, టెండర్ల ప్రక్రియ, భూకేటాయింపులపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అయితే బీఆర్ఎస్ నేతలు చేసిన ఈ ఆరోపణలు రాజకీయంగా చేసినవేనని కాంగ్రెస్ వర్గాలు కొట్టిపారేస్తున్నాయి. ప్రాజెక్టుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక వసతుల కల్పనలో భాగంగానే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని అధికార పక్షం చెబుతోంది.

**సభలో సస్పెన్షన్.. బయట సమరం**
అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసి తమ గొంతు నొక్కాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ మండిపడింది. అందుకే అసెంబ్లీ వెలుపల ప్రజల మధ్యకు వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగానే ఫ్యూచర్ సిటీ భూకేటాయింపులను ప్రధాన అస్త్రంగా మార్చుకున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. బీఆర్ఎస్ నేతల మిగతా 02లో

## ప్రభుత్వం, ఉద్యోగులపై రూపాయి భారం లేదు

- 12.91 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపు
- ఇప్పటికే 98 క్లెయిమ్‌ల పరిష్కారం.. రూ.కోట్లలో చెల్లింపులు
- ఉద్యోగుల కోసం హెల్త్ కార్డు కూడా తీసుకొచ్చాం



### ఉద్యోగులకు రూ.కోటి బీమా..

# దేశంలో తొలిసారి

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ముద్ర, హైదరాబాద్:**
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లకు అందిస్తున్న రూ.కోటి బీమా పథకం దేశంలోనే తొలిసారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రకటించారు. ఉద్యోగి దురదృష్టవశాత్తూ మరణించినా అతడి కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకుండా భద్రత కల్పించాలనే మానవీయ ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా బ్యాంకుల సహకారంతో పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన సభకు చెప్పారు. గురువారం నాడు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా, హెల్త్ కార్డుల గురించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వివరణాత్మకంగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 16 బ్యాంకులతో ఒప్పందం చేసుకుని రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బీమా కవరేజీ కల్పిస్తోందన్నారు. ఈ మేరకు 2024 జూన్ 26న ఆర్థిక శాఖ 77వ జీవో సర్క్యులర్ జారీ చేసింది. పథకం అమలు విధానం, అర్హతలు, బీమా కవరేజీ, నిబంధనలు, షరతులను అందులో పేర్కొంది.

**12.91 లక్షల మందికి కవరేజీ:**
రాష్ట్రంలో మొత్తం 12,91,056 మంది ఈ పథకం పరిధిలో ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. వీరిలో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. ఇంకా 5,00,158 మంది తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, మిగతా 02లో

సెలవు కోసం తోటి విద్యార్థి

## మర్డర్ ప్లాన్

- చదువంటే విసుగొచ్చింది.. ఒకడిని లేపేస్తే లీవ్ దొరుకుతుంది
- గురుకులంలో క్లాస్ రూమ్ క్రైమ్ థ్రిల్లర్

02



ప్రతిపక్షం కుట్రలను ప్రజల్లోకి

## తీసుకెళ్లాలి

సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు



- ఎమ్మెల్యేలు సభకు తప్పనిసరిగా హాజరు కావాలి
- కులగణన తెలంగాణ ఘనత.. దేశవ్యాప్త అమలుకు ఒత్తిడి తేవాలి

02

### అర్హులకు ఇల్లు లేదంటే

# ఇంటి పట్టాలు

## ఏపీలో ఇళ్ల పట్టాల పంపిణీపై సీఎం చంద్రబాబు ఆదేశాలు

10 రోజుల డెడ్‌లైన్

- సీసీఎల్ఏలో స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్
- ఎస్సీల ప్రయోజనాలను బుడగ జంగాలకూ వర్తింప చేయాలి
- ప్రణాళిక ప్రకారం కలెక్టర్లు అభివృద్ధి చేపట్టాలి
- కలెక్టర్ల సదస్సులో యాక్షన్ టేకెన్ రిపోర్టుపై సీఎం చంద్రబాబు ఆదేశాలు

02




### 1980s ఫొటో ట్రెండ్ వెనుక

# పెద్ద కుట్ర

## నెటిజన్లకు బిగ్ అలర్ట్..

వింటేజ్ ఫొటోల పేరుతో మాల్వేర్ యాప్స్
నకిలీ APKలతో వ్యక్తిగత డేటాకు ఎసరు

02

- ఒక్క క్లిక్‌తో ఫొటో.. మొత్తం డేటా లీక్!
- ట్రెండ్ మోజులో హ్యాకర్ల వలలో పడొద్దు
- 1980s ఏఐ ట్రెండ్‌పై సైబర్ నేరగాళ్ల కన్ను






ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 11.09.2026
www.mudranews.in | @mudranews



### లోబీపీ : మంచినీళ్లు తాగండి



డీహైడ్రేషన్ వల్ల బీపీ పడిపోవచ్చు. తగినంత నీరు తాగడం వల్ల రక్త పరిమాణం మెరుగుపడి బీపీ సాధారణ స్థాయికి రావడానికి సహాయపడుతుంది.

## 1980s ఫొటో ట్రెండ్ వెనుక
# పెద్ద కుట్ర

**ముద్ర, హైదరాబాద్:**
సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్‌గా మారిన '1980s వింటేజ్ ఫొటో ట్రెండ్'ను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. 1980ల నాటి హెయిర్‌స్టైల్, డ్రెస్సింగ్, పాతకాలపు లుక్‌తో ఫొటోలను మార్చుకునేందుకు నెటిజన్లు ఏఐ టూల్స్‌ను ఆశ్రయిస్తుండగా.. ఇదే ఆసక్తిని ఆసరాగా చేసుకుని హ్యాకర్లు '1980s AI Trend' పేరుతో నకిలీ యాప్స్, APK ఫైళ్లను సృష్టిస్తున్నారు. చాట్‌జీపీటీ వంటి అధికారిక ఏఐ సాధనాల్లో ఉచిత వినియోగానికి పరిమితులు ఉండటం, ఫొటో ఎడిటింగ్‌లో కొన్నిసార్లు ఆశించిన ఫలితం రాకపోవడంతో కొందరు ప్రత్యామ్నాయ యాప్స్ కోసం వెతుకుతున్నారు. ఇదే బలహీనతను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తున్నారు. థర్డ్‌పార్టీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా పోస్టులు, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా 'ఒక్క క్లిక్‌తో 1980ల లుక్' అంటూ మోసపూరిత APKలను ప్రచారం చేస్తున్నారు.

**ఇన్‌స్టాల్ చేస్తే.. ఫోన్ హ్యాకర్ల చేతుల్లోకి!**
తెలియని మూలాల నుంచి APKను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేస్తే ప్రమాదం మొదలవుతుంది. అనుమతుల పేరుతో ఫోన్‌లోని ఫొటోలు, గ్యాలరీ, కాంటాక్ట్స్, ఫైల్స్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని యాప్‌లు సేకరించే అవకాశం ఉంది. అంతేకాకుండా కొన్ని హానికరమైన యాప్‌లు ఫోన్‌పై నిఘా పెట్టి సున్నితమైన సమాచారాన్ని దొంగిలించే ప్రమాదం ఉంది. వ్యక్తిగత ఫొటోలు, డేటా చేతికి చిక్కితే వాటిని అడ్డుపెట్టుకుని బాధితులను బెదిరించడం, డబ్బులు డిమాండ్ చేయడం వంటి సైబర్ నేరాలకు పాల్పడే అవకాశం కూడా ఉంది.

**నెటిజన్లు జాగ్రత్త!**
ఏఐ ఫొటో ట్రెండ్‌లో పాల్గొనాలనుకునే వారు గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ లేదా సంబంధిత అధికారిక వెబ్‌సైట్లలో లభించే నమ్మకమైన యాప్స్‌ను మాత్రమే ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ లేదా ఇతర సోషల్ మీడియా ద్వారా వచ్చే అపరిచిత APK లింక్‌లను క్లిక్ చేయడం, డౌన్‌లోడ్ చేయడం, ఇన్‌స్టాల్ చేయడం చేయొద్దని హెచ్చరిస్తున్నారు. ట్రెండ్ కోసం ఫోన్‌లోని డేటా ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

# టార్గెట్ రేవంత్ ఫ్యామిలీ

(మొదటి పేపజీ తరువాయి)
పర్యటన నేపథ్యంలో తుక్కుగూడ, రావిర్యాల ప్రాంతాల్లో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తల కదలికలను నియంత్రించే ప్రయత్నం చేశారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో గులాబీ శ్రేణులు హోరెత్తించాయి.

**ఫ్యూచర్ సిటీనే రాజకీయ రణరంగం**
ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును అభివృద్ధి అజెండాగా ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా.. అదే ప్రాజెక్టులోని భూకేటాయింపులను రాజకీయ అస్త్రంగా మలచుకోవాలని బీఆర్ఎస్ వ్యూహం రచిస్తోంది. దీంతో రాబోయే రోజుల్లో ఫ్యూచర్ సిటీ అంశం తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. భూకేటాయింపులపై లీగల్‌గా, పొలిటికల్‌గా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. అసెంబ్లీలో తమను సస్పెండ్ చేసినా.. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని కేటీఆర్, హరీష్ రావు ప్రకటించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. సస్పెన్షన్‌తో సభకు దూరమైన గులాబీ ఎమ్మెల్యేలు.. ఇప్పుడు ఫ్యూచర్ సిటీని వేదికగా చేసుకుని కాంగ్రెస్ సర్కార్‌పై సమరశంఖం పూరించారు. ఈ భూవివాదం ఎటు దారితీస్తుందన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# సెలవు కోసం మర్డర్ ప్లాన్

**ముద్ర, అన్నమయ్య :**
స్కూల్‌కు సెలవు కావాలని ఇద్దరు మైనర్ విద్యార్థులు చేసిన ఆలోచన ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది. అన్నమయ్య జిల్లా కంభం వారిపల్లి మండలం గ్యారంపల్లె గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఈ దారుణానికి ప్లాన్ చేసినట్లు అధికారులు గుర్తించారు. చదువు, స్కూల్ అంటే బోర్ కొట్టడంతో ఎలాగైనా సెలవు రావాలని వారు భావించారు. రెండేళ్ల క్రితం పాఠశాలలో ఓ విద్యార్థి మృతి చెందినప్పుడు సెలవు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసుకుని.. ఇప్పుడు కూడా ఎవరైనా చనిపోతే సెలవు ఇస్తారనే ఉద్దేశంతో సాటి విద్యార్థిని హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అందరూ నిద్రలో ఉన్న సమయంలో బాధిత విద్యార్థి ముఖంపై దిండు పెట్టి అదిమిపట్టి, గొంతు నులిమేందుకు ప్రయత్నించారు. అయితే బాధితుడు మేల్కొని వారి నుంచి తప్పించుకుని వార్డెన్‌కు విషయం చెప్పాడు. ఈ ఘటనపై సమాచారం అందడంతో ఎంఈఓ రెడ్డి బాషా హాస్టల్‌ను సందర్శించి విచారణ చేపట్టారు. హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు విద్యార్థులకు టీసీలు ఇచ్చి పంపించినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు వెల్లడించారు. సెలవు కోసం ఏకంగా ప్రాణాలు తీయాలనే ఆలోచనకు రావడం పిల్లలపై సోషల్ మీడియా, హింసాత్మక కంటెంట్ ప్రభావంపై మరోసారి ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# సెక్రటేరియట్‌లోనే లంచం..

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ సచివాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) సెక్షన్‌లో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు ఇచ్చేందుకు బాధితుడి నుంచి రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. సీఎంఆర్ఎఫ్ చెక్కు లంచం అడగడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. గురువారం సచివాలయ ప్రాంగణంలో నిఘా ఏర్పాటు చేశారు. సచివాలయంలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.లక్ష లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత సీఎంఆర్ఎఫ్ సెక్షన్‌లోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేయడం వెనుక మరికొందరి పాత్ర ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో రెగ్యులర్ అధికారుల ప్రమేయం ఉందా? అన్నదీ ఏసీబీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





(మొదటి పేజీ తరువాయి)
మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, డైలీవేజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఎంటీఎస్, సెర్ప్ తదితర సిబ్బంది ఉన్నారు. 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారని అన్నారు.

**సింగరేణితో శ్రీకారం**
ఉద్యోగుల కోసం రూ.కోటి బీమా పథకానికి తొలుత సింగరేణి కాలరీస్‌లో శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ పరిధిలోని డిస్కమ్‌లు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పథకాన్ని విస్తరించినట్లు చెప్పారు. చివరగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ వర్తించేలా విస్తరించినట్లు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులకు 2024 ఫిబ్రవరిలో, ఇంధన శాఖ ఉద్యోగులకు 2025లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ 2026 జూన్ 25 నుంచి పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

**ప్రభుత్వానికి రూపాయి భారం లేదు**
ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్న బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరిపి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగుల జీతాలు తమ బ్యాంకుల ద్వారా జమ అవుతున్నందున, బ్యాంకులకు వ్యాపార పరంగా ప్రయోజనం కలుగుతున్న నేపథ్యంలో బీమా పథకానికి బ్యాంకులే సహకరించేలా ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ప్రీమియం భారం లేకుండా పథకం అమలవుతోందన్నారు.

## ఉద్యోగులకు రూ.కోటి బీమా..
# దేశంలోనే తొలిసారి

**ఇప్పటికే క్లెయిమ్‌ల పరిష్కారం**
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇప్పటివరకు 33 క్లెయిమ్‌లు వచ్చాయన్నారు. అందులో 24 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు ప్రకటించారు. విద్యుత్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో పరిధిలో 15 క్లెయిమ్‌లు రాగా, అన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. ఈ విభాగంలో రూ.15 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా సింగరేణి కాలరీస్‌లో 50 క్లెయిమ్‌లు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు తెలిపారు.

**ఉద్యోగులకు రూ.1.20 కోట్లు**
ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి బీమాతో పాటు ఇతర ప్రయోజనాలు కలిపి రూ.1.20 కోట్ల వరకు ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. విమాన ప్రయాణ సమయంలో ప్రమాదం జరిగితే రూ.2 కోట్ల వరకు బీమా ప్రయోజనం కల్పిస్తున్నట్లు వెల్లడించించారు. సహజ మరణానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం కల్పించే వెసులుబాటు కూడా ఉన్నట్లు చెప్పారు.

**కేంద్రం, ఇతర రాష్ట్రాలు అధ్యయనం**
తెలంగాణలో ప్రారంభించిన ప్రమాద బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసిందని ఉప ముఖ్యమంత్రి సభకు చెప్పారు. ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణలో అమలు చేస్తున్న ఈ బీమా విధానాన్ని పరిశీలించేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. తమిళనాడు కూడా ఈ తరహా పథకాన్ని అమలు చేసినట్లు ఆయన వెల్లడించారు

### ఉద్యోగులకు హెల్త్‌కార్డు

బీమా పథకంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్‌కార్డు పథకాన్ని కూడా తీసుకొచ్చినట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగ సంఘాలు కోరుతున్న క్యాష్ లెస్ వైద్య సేవల కలను ప్రభుత్వం సాకారం చే సిందని ఆయన చెప్పారు. ఉద్యోగులు, వారి సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ముఖ్య కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేసి చర్చల అనంతరం హెల్త్ కార్డుల విధానాన్ని ఖరారు చేసినట్లు వివరించారు. క్యాష్‌లెస్ వైద్యం, సీజీహెచ్ఎస్ ప్యాకేజీ వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన చెప్పారు. హెల్త్‌కార్డు పథ కం కోసం ఇప్పటికే సుమారు రూ.240 కోట్ల నిధులు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి బీమా, ఆరో గ్య భద్రతకు హెల్త్‌కార్డు, రెండు పథకాలూ ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక, వైద్య భరోసా కల్పించేలా రూపొందించామని ఉప ముఖ్య మంత్రి భట్టి శాసనసభకు చెప్పారు.

# ప్రతిపక్షం కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ముద్ర, హైదరాబాద్ :**
అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్పీ) సమావేశం ఉత్కంఠభరితంగా సాగింది. ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షం తీరు, అసెంబ్లీలో జరిగిన పరిణామాలు, భవిష్యత్ వ్యూహంపై దిశానిర్దేశం చేశారు.




**బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు**
అధికారం పోయినా అహంకారం వీడకుండా బీఆర్ఎస్ నాయకులు ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ (కేసీఆర్) అధ్యక్షతన సభను సజావుగా జరగకుండా కుట్రలు చేశారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. పోలీసు అధికారులను, ప్రజాప్రతినిధులను దూషించి మూడు రోజులు సభ జరగకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. అధికారులపై అనుచితంగా వ్యవహరించడం, మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించడం, స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించడం హేయమన్నారు. నిరసన తెలిపేందుకు ఎస్సీ సెల్ కార్యక్రమం చేపడితే దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష కుట్రను బలంగా తిప్పికొట్టి, ప్రభుత్వంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజలకు తెలియజేసిన ప్రజాప్రతినిధులను అభినందించారు. జరిగిన సంఘటనలపై విచారణ చేపట్టడం జరిగిందని స్పష్టం చేశారు.

**సభలో క్రమశిక్షణ, హాజరుపై హెచ్చరిక**
సభ్యులు తప్పనిసరిగా సభలో చర్చల్లో పాల్గొనాలని, హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా రాణించలేరని హెచ్చరించారు. అందరికీ వెసులుబాటుగా ఉండాలనే అత్యంత చారిత్రక భవనంలో శాసనమండలిని నిర్వహిస్తున్నామని, అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను ప్రారంభించుకుని దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టుకున్నామని గుర్తుచేశారు. సభ్యులు సభలో తమ నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలను ప్రస్తావించాలని, అసెంబ్లీ జరిగినన్ని రోజులు సంపూర్ణ హాజరు ఉండాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రా రెడ్డి రాష్ట్ర స్థాయి నాయకులుగా ఎదిగేవారా అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిపై దాడి ఘటనను ప్రస్తావిస్తూ.. కేటీఆర్‌కు పోలీసుల్లో రేవంత్ రెడ్డి కనిపించినట్లున్నారని, అంత ఆక్రోశంతో అధికారులపై దాడులు చేశారని ఎద్దేవా చేశారు.

**కులగణన, ఓటర్ల జాబితాపై అప్రమత్తత**
దేశానికి మనం చేసిన కులగణన రోల్ మోడల్ అని, ఇది తెలంగాణ రాష్ట్రం సాధించిన ఘనత అని సీఎం అన్నారు. తెలంగాణ (Telangana) నమూనాను జాతీయ స్థాయిలో అమలు చేయాలని, దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ (SIR) పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా తేలితే, ఓటర్ల జాబితా మాత్రం 88 కోట్లుగా చూపుతున్నారని, దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కడో ఏదో ప్రమాదం పొంచి ఉందని, ఎస్ఐఆర్ (SIR) అంశాన్ని సీరియస్‌గా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సభ్యుల ప్రతి ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుందని, వ్యక్తిగత పనితీరు గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని గుర్తుచేశారు. వెయ్యి రోజుల పాలనకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ, మీ సహకారంతోనే దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలను తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇంటి పట్టాలు

**ముద్ర, హైదరాబాద్ :**
రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇంటి పట్టాలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలపై పరిమిత సమయం పెట్టుకుని పనిచేయాలని స్పష్టం చేశారు. ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణాలకు సంబంధించి 10 రోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో రావాలని సంబంధిత అధికారులను చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో గృహ నిర్మాణం, పేదల ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై చర్చించారు. ప్రస్తుతం 1.43 లక్షల మందిని ఇళ్ల పట్టాలకు అర్హులుగా గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరో 1.26 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, వచ్చే నెల 15వ తేదీ నాటికి వాటి పరిశీలన పూర్తి చేస్తామని తెలిపారు.

**18వేల మందికి ఇళ్ల పట్టాలు**
రాష్ట్రంలోని 1,692 గ్రామాల్లో 18 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన భూమిని గుర్తించినట్లు అధికారులు సీఎం చంద్రబాబు నాయుడుకు తెలియజేశారు. ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియను ఏడాదిలోపు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఎంతమందికి కొత్తగా ఇళ్ల పట్టాలు ఇవ్వాలి.. ఎంతమందికి పట్టాలను క్రమబద్ధీకరించాలనే అంశాలపై స్పష్టమైన జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో గృహ నిర్మాణాల పురోగతిపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇప్పటివరకు 5.92 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలిపారు. మరో 5.32 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లన్నింటినీ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇళ్ల పట్టా అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. జిల్లా ఇంఛార్జ్ మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అర్హుల గుర్తింపు నుంచి పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాల పూర్తి వరకు ప్రతి దశను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

## మైనర్ల సోషల్ మీడియా వాడకంపై
# కేంద్రానికి నోటీసులు

**ముద్ర, హైదరాబాద్:**
సోషల్ మీడియా ఖాతాల వినియోగం అంశంలో మైనర్లపై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం గురువారం నోటీసులు జారీ చేసింది. భారత కాంట్రాక్ట్ చట్టం ప్రకారం మైనర్లు ఎటువంటి ఒప్పందాల్లోనూ భాగస్వాములు కాలేరని, అలాంటప్పుడు సోషల్ మీడియా ఖాతాలు తెరిచే సమయంలో ఆన్‌లైన్ ఒప్పందాలను వారు ఎలా అంగీకరిస్తారని పిటిషనర్ ప్రశ్నించారు.
జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై సమాధానమివ్వాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ, న్యాయ శాఖలను ఆదేశించింది. 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' అనే స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. విచారణలో భాగంగా పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది హెచ్.ఎస్. ఫూల్కా వాదనలు వినిపిస్తూ, అమెరికాలో 13 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడంపై నిషేధం ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.
ఈ వాదనలతో ఏకీభవించిన జస్టిస్ సూర్యకాంత్, 'భారత్‌లోనూ ఇటువంటి రక్షణ చర్యలు అవసరం ఉంది' అని వ్యాఖ్యానించారు. ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ బాగ్చి స్పందిస్తూ నియంత్రణకు 'ఫైర్‌వాల్స్' ఉండాలని అభిప్రాయపడ్డారు.
మైనర్లు సోషల్ మీడియా ఖాతాలను ప్రారంభించడం వల్ల ఆన్‌లైన్ గ్రూమింగ్, లైంగిక వేధింపులు, సైబర్ బుల్లీయింగ్, వ్యక్తిగత సమా చారం దుర్వినియోగం వంటి ముప్పులను ఎదుర్కొంటున్నారని పిటి షన్‌లో పేర్కొన్నారు. సోషల్ మీడియా సంస్థలు వయసు నిర్ధారణ కోసం పటిష్ఠమైన యంత్రాంగాన్ని అనుసరించేలా, మైనర్లు సొంతం గా ఖాతాలు తెరవకుండా నిరోధించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కాగా, తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉండే ఖాతాల ద్వారా విద్యా సంబంధిత కంటెంట్‌ను వీక్షించేందుకు అనుమతించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

## కేటీఆర్, హరీశ్ రావుపై
# లైంగిక వేధింపుల కేసు

**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ అసెంబ్లీ వద్ద విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు సహా నలుగురు నేతలపై పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గేట్ నెం.3 వద్ద మహిళా కానిస్టేబుళ్లు భద్రతా విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో రాజకీయ నినాదాలున్న నల్ల టీ-షర్టులు ధరించి, ప్లకార్డులతో కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు అక్కడికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం అలాంటి దుస్తులు, వస్తువులకు అనుమతి లేదని పోలీసులు చెప్పగా, బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడారని మహిళా కానిస్టేబుల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.
హరీశ్‌రావు, కేటీఆర్ తమను అవమానకర రీతిలో దూషించారని ఆమె తెలిపారు. హరీశ్‌రావు తన టీ-షర్టును విప్పి ఓ పోలీసు అధికారిపైకి విసిరి, మహిళా సిబ్బంది ముందే అర్ధనగ్నంగా నిలబడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా అదే విధంగా ప్రవర్తించి, తమకు తీవ్ర ఇబ్బంది కలిగించారని ఫిర్యాదులో వివరించారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం వంటి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 11.09.2026
www.mudranews.in | @mudranews


## లోబీపీ : చిన్న చిన్న భోజనాలు చేయండి

ఒకేసారి ఎక్కువగా తినడం వల్ల కొందరిలో భోజనం తర్వాత బీపీ పడిపోవచ్చు. రోజులో చిన్న మోతాదుల్లో, తరచుగా భోజనం చేయడం సహాయపడుతుంది.



## జల సంరక్షణ 'రంగ' సేవలకు గుర్తింపు

**ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డుకు షార్ట్‌లిస్ట్**



**ముద్ర న్యూస్ బ్యూరో హైదరాబాద్:** పర్యావరణ పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణ రంగాల్లో విశేష కృషి చేస్తున్న హైదరాబాద్ కు చెందిన పర్యావరణ వేత్త, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిపుణుడు రంగ ప్రసాద్ ప్రతిష్మాత్మక ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డుకు షార్ట్ లిస్ట్ అయ్యారు. సస్టెయిన బిలిటీ (ఎమర్జింగ్ ) విభాగంలో మరి కొంత మందితో పాటు ఆయనను ఎంపి క చేశారు. ఈ నెల 9వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఓటింగ్ నిర్వహించి ఎక్కువ ఓట్లు లభించిన వారికి అవార్డును బహూకరిస్తారు. రంగ ప్రసాద్ 2009 నుంచి పర్యావరణ పరిరక్షణకు సంబం ధించిన అంశాలపై పనిచేస్తున్నారు. 2016 నుంచి హైదరాబాద్ లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయన నిర్వహిస్తున్న 'HydRainHarvest' సంస్థ ద్వారా నగరంలోని వివిధ ప్రాంతాల్లో వందలాది వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీచార్జ్ ( వాటర్ హార్వెస్టింగ్ పిట్స్) నిర్మాణాలను చేపట్టారు. కొత్తగా రీచార్జ్ పిట్స్ నిర్మించడమే కాకుండా, నిర్లక్ష్యానికి గురైన పాత హార్వెస్టింగ్ పిట్స్ ను గుర్తించి వాటిని పునరుద్ధరించడం, నిర్వహించడం వంటి కార్యక్రమాలను కూడా ఆయన చేపట్టారు. నీటి కొరత, భూగర్భ జలాల తగ్గుదల, వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణను ప్రజల దైనందిన జీవన విధానంలో ఒక భాగంగా మార్చాల్సిన అవసరం ఉందని రంగ ప్రసాద్ ప్రచారం చేస్తున్నారు. అపార్ట్ మెంట్ కమ్యూనిటీలు, వ్యక్తిగత గృహ యజమానులు, విద్యా–వాణిజ్య సంస్థలు వర్షపు నీటిని సంరక్షించడంలో తమ వంతు బాధ్యత తీసుకోవాలని ఆయన అవగాహన కల్పిస్తున్నారు.ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డుకు రంగ ప్రసాద్ షార్ట్ లిస్ట్ కావడం పర్యావరణ పరిరక్షణ, సుస్థిర నీటి నిర్వహణ కోసం హైదరాబాద్ లో కొనసాగుతున్న ప్రయత్నాలకు గుర్తింపుగా భావిస్తున్నారు. ఈ లింక్ https://prideoftelangana.com/vote.php ను ఉపయోగించి ఆయనకు ఓటు వేసి అవార్డు పొందడానికి సహకరించాలని పలువురు పర్యావరణవేత్తలు, ఆయన స్నేహితులు కోరుతున్నారు.

## 22ఏపై చర్చకు బీఆర్ఎస్ ఎందుకు భయపడుతోంది

**- ఎమ్మెల్యేలు**

**ముద్ర, హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీ అబద్ధాలు, అసత్యాల పునాదిపై ఏర్పడిందని ఎమ్మెల్యేలు వేముల వీరేశం, లక్ష్మీకాంతరావు తోట విమర్శించారు. 22ఏ భూముల అంశంపై చర్చకు బీఆర్ఎస్ నేతలు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. గత పదేళ్లలో కేసీఆర్, కేటీఆర్ భూ దోపిడీకి పాల్పడ్డారని, లాజిస్టిక్ పార్కుల పేరుతో భూములు మింగారని వీరేశం ఆరోపించారు. వాస్తవాలు బయటపడతాయనే భయంతోనే సభకు రావడం లేదన్నారు. బీఆర్ఎస్ నేతలు దళితులను అవమానించారని లక్ష్మీకాంతరావు తోట ఆరోపించారు. దళితుడు స్పీకర్‌గా ఉన్నందుకే కేసీఆర్ సభకు రావడం లేదని విమర్శించారు. దళితులు నడిచిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం కుల దురహంకారానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ నేతల వ్యవహారంపై గవర్నర్, డీజీపీ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమం కేవలం కేసీఆర్ వల్లే జరగలేదని, అందులో దళితుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

## బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక మలుపు

**పోలీసుల అదుపులో ఆర్మీ అధికారి!**
**బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ కేసులో కీలక మలుపు**
**ఒకట్రెండు రోజుల్లో తెరపడే అవకాశాలు**
**కేసు విచారణ విషయాలను అత్యంత గోప్యంగా ఉంచుతున్న పోలీసులు**



**ముద్ర, హైదరాబాద్ :** బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ కేసు కీలక మలుపు తిరిగింది. 10 రోజుల దర్యాప్తు తర్వాత ఓ ఆర్మీ అధికారి చుట్టూ అనుమానాలు బలపడినట్లు సమాచారం. 7 రోజులుగా పోలీస్, ఎన్ఐఏ, ఆర్మీ అధికారులు ఆయనను విడతల వారీగా ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో సంచల నం రేపిన ఆయుధాల చోరీ మిస్టరీకి ఒకట్రెండు రోజుల్లో తెరపడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రంగంలోకి దిల్లీ నుంచి మిలటరీ అధికారులు : ఆగస్టు 30వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి 31వ తేదీ ఉదయం 7 గంటల మధ్య బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ జరిగింది. లెఫ్టినెంట్ కల్నల్ మయాంక్ గోవిటీర్కార్ ఫిర్యాదుతో బొల్లారం పోలీసులు కేసు నమోదు చేశారు. మొత్తం 12 తుపాకులు, 21 మ్యాగజైన్లు, నైట్ విజన్ బైనాక్యులర్‌తో పాటు 1,912 బుల్లెట్లు చోరీకి గురయ్యాయి. ఘటన తీవ్రతతో దిల్లీ నుంచి మిలటరీ ఉన్నతాధికారు లు రంగంలోకి దిగారు. మిలటరీ ఇంటెలిజెన్స్, ఎన్ఐఏ, మల్కాజిగిరి పోలీసులు సంయుక్తంగా దర్యాప్తును చేపట్టారు.

**భద్రపరిచే కోట్ వద్ద విధుల్లో :** మద్రాస్ రెజిమెంట్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని వందలాది సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. అయితే ఇప్పటి వరకు ఒక మ్యాగజైన్ మాత్రమే లభించగా, చోరీకి పాల్పడిన వారి ఆచూకీ మాత్రం తెలియలేదు. ఆయుధాలు భద్రపరిచే కోట్ వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది, అక్కడికి ప్రవేశించే అధికారం ఉన్నవారిని గుర్తించి మొత్తం 42 మందితో జాబితా సిద్ధం చేశారు. ఒక్కొక్కరినీ విచారణ చేయగా, కొందరికి చోరీతో సంబంధం లేదని నిర్ధారించి దర్యాప్తు నుంచి మినహాయించారు. మిగిలిన వారిని ప్రశ్నిస్తున్న క్రమంలో ఓ ఆర్మీ అధికారి ప్రవర్తనపై బలంగా అనుమానాలు వ్యక్తమైనట్లు సమాచారం.

## కుమారుడి ఫొటోను రివీల్ చేసిన వరుణ్‌తేజ్-లావణ్య దంపతులు



**ముద్ర, హైదరాబాద్ :** నటుడు వరుణ్ తేజ్ – లావణ్య త్రిపాఠి దంపతులు తొలిసారిగా తమ కుమారుడి ఫొటోను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 10న వరుణ్–లావణ్య దంపతులకు కుమారుడు పుట్టిన విషయం తెలిసిందే. తమ కుమారుడికి 'వాయువ్ తేజ్' అని పేరు పెట్టినట్లు గతంలో వెల్లడించారు. వాయువ్ మొదటి బర్త్‌డే సందర్భంగా తొలి సారిగా చిన్నారి ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

**రూ.5 లక్షల ఉచిత సాయం దేశంలో ఎక్కడా లేదు.. తెలంగాణలోనే అమలు**
**రెండో విడతలో 59 వేల గుడిసెలకు ఇందిరమ్మ ఇళ్లు**
**ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు**
**ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టీకరణ**

**ముద్ర, హైదరాబాద్:** పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ పలు కీలక విషయాలను వెల్లడించారు.

పేదలను జీవనోపాధికి దూరంగా 30–40 కిలోమీటర్ల దూరానికి తరలించే విధానం తమ ప్రభుత్వానికి లేదన్నారు. ఎకరం రూ.150–200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లోనూ పేదలకు ఇళ్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

**లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి తెలిపారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని, ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు ఎంపికైనట్లు తేలితే వారి పేర్లు తొలగిస్తామని స్పష్టం చేశారు.



**8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా**

రెండు విడతల్లో సుమారు 8 లక్షల ఇళ్లను మంజూరు చేస్తున్నామని, వీటి కోసం రాష్ట్ర ప్రభుత్వంపై రూ.40 వేల కోట్లకు పైగా భారం పడుతుందని తెలిపారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందిస్తామని చెప్పారు. ఇంటి నిర్మాణానికి ఒక్కో లబ్ధిదారుడికి రూ.5 లక్షలు ఉచితంగా అందిస్తున్నామని, ఈ మొత్తాన్ని పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు.

**సిమెంట్ బ్యాగ్ రూ.230కే**

మార్కెట్లో రూ.310–320గా ఉన్న 50 కేజీల సిమెంట్ బ్యాగ్‌ను పేదలకు రూ.230కే అందించేలా సిమెంట్ కంపెనీలతో ఒప్పందం పూర్తయిందని మంత్రి వెల్లడించారు. స్టీల్‌ను కూడా తక్కువ ధరకు అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

**59 వేల గుడిసెలకు ప్రాధాన్యం**

రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన సుమారు 59 వేల గుడిసెలకు రెండో విడతలో ప్రాధాన్యత ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే హైదరాబాద్‌లోని 20 నియోజకవర్గాల్లో పైలట్ మోడల్‌గా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని, వచ్చే ఏడాది బోనాల నాటికి గృహప్రవేశాలు జరిగేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు.

**పాత ప్రభుత్వ భూముల్లో నెల రోజుల్లో పట్టాలు**

గతంలో పేదల కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాల్లో ఇంకా కేటాయింపులు జరగని భూములను గుర్తించి, అర్హులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నెల రోజుల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించినట్లు చెప్పారు.

**అసంపూర్తి ఇళ్లకు ప్రత్యేక అవకాశం**

గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిన 2BHK ఇళ్లకు రూ.750 కోట్ల బిల్లులు చెల్లించామని, మౌలిక వసతుల కోసం రూ.600 కోట్లకు పైగా ఖర్చు చేశామని తెలిపారు. సొంత డబ్బులతో ఫౌండేషన్, గోడలు లేదా స్లాబ్ వరకు నిర్మించి ఆగిపోయిన ఇళ్లకు రెండో విడతలో ప్రత్యేక అవకాశం కల్పించామని చెప్పారు.

డ్వాక్రా మహిళా సంఘాల్లో సభ్యులైన, ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని పేదలకు రూ.లక్ష అడ్వాన్స్‌గా అందించే వెసులుబాటు కల్పించామని మంత్రి పొంగులేటి తెలిపారు.

## నూతన ఈహెచ్ఎస్‌తో మెరుగైన వైద్యం

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అమలు చేస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. గురువారం శాసన మండలిలో ఎమ్మెల్సీల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. 2026 జూలై 17 నుంచి పథకం అమల్లోకి వచ్చిందన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు 1.5 శాతం చొప్పున చెల్లిస్తుండగా, ప్రభుత్వం కూడా అంతే మొత్తాన్ని సమకూరుస్తోందని తెలిపారు. దీంతో నెలకు రూ.88 కోట్లు, ఏడాదికి రూ.1,056 కోట్ల నిధులు సమకూరుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం 921 ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, 17 లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. 12 జిల్లాల్లో వెల్‌నెస్ కేంద్రాలు పనిచేస్తుండగా, మరో 25 ఏర్పాటు చేసి మొత్తం 37కు పెంచనున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 8,511 కేసులకు రూ.55.14 కోట్ల ప్రీ–ఆథరైజేషన్ ఇచ్చామని మంత్రి తెలిపారు.

## అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక ఐలమ్మ

**ముద్ర, హైదరాబాద్:** వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి ఘన నివాళులు అర్పించారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్ర చిరస్మరణీయమని అన్నారు. అణచివేత, దోపిడీ, దొరల పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం నేటి తరాలకు ఆదర్శమన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు.

## కూరగాయల సాగు విస్తీర్ణం పెంచుతాం: మంత్రి తుమ్మల



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచి, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు తగ్గించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. ప్రస్తుతం రాష్ట్రంలో తగ్గిన కూరగాయల సాగును తిరిగి పెంచడమే లక్ష్యమన్నారు.

గతంలో సుమారు 3 లక్షల ఎకరాల్లో కూరగాయలు సాగయ్యేవని, ప్రస్తుతం ఆ విస్తీర్ణం లక్ష ఎకరాలకు తగ్గిందని మంత్రి తెలిపారు. దీంతో 2025–26లో సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ వానాకాలంలో లక్ష ఎకరాల్లో, వచ్చే రబీలో మరో లక్ష ఎకరాల్లో కూరగాయల సాగు చేపట్టేలా ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు.

కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు నారు, మల్చింగ్, షేడ్‌నెట్, శాశ్వత పందిళ్లు, బిందు, తుంపర సేద్యం వంటి సదుపాయాలకు రూ.125 కోట్లకుపైగా కేటాయించినట్లు తెలిపారు. ఉత్పత్తి పెంచడంతో పాటు కోల్డ్‌స్టోరేజీలు, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతులపై కూడా దృష్టి సారిస్తున్నామన్నారు.

హైదరాబాద్ సమీపంలోని కోహెడలో 170 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో నాణ్యతపై రాజీ పడబోమని స్పష్టం చేశారు. ప్రమాణాలు పాటించని ఆరు ప్రైవేట్ కళాశాలల అనుబంధాన్ని ఇప్పటికే రద్దు చేశామని తెలిపారు. అలాగే వ్యవసాయ విద్యను ఆధునిక సాంకేతికత, డిజిటల్ అగ్రికల్చర్‌కు అనుగుణంగా తీర్చిదిద్దుతూ, కొత్త వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేసి సీట్ల సంఖ్యను 1,100 నుంచి 2,000కు పెంచినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు.

## ఆర్టీసీకి కొత్త ఊపు.. బలోపేతమే లక్ష్యం: మంత్రి పొన్నం



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ ప్రజలకు ఆర్టీసీ జీవనాడి వంటిదని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శాసనసభలో పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. ప్రతిరోజూ సుమారు 65 లక్షల మంది ప్రయాణికులను ఆర్టీసీ గమ్యస్థానాలకు చేరుస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సంస్థ నిర్లక్ష్యానికి గురైందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు.

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆర్టీసీకి కొత్త ఊపు వచ్చిందని మంత్రి చెప్పారు. ఇప్పటివరకు 347.47 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించగా, రూ.12,171 కోట్లు ఆదా చేసుకున్నారని తెలిపారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త సర్వీసులు, అదనపు ట్రిప్పులు, కొత్త రూట్లను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు.

పాత బస్సుల స్థానంలో ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, 340 డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా రెట్రోఫిట్ చేశామని తెలిపారు. హైదరాబాద్‌లో PM E-Drive కింద మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తున్నామని, 244 మంది తొలగించబడిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకున్నామని, 1,430 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించామని మంత్రి వివరించారు. ఆర్టీసీ ఆస్తులను కాపాడుతూ సంస్థ అభివృద్ధికి వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఆర్టీసీని కాపాడటమే కాదు.. దేశంలోనే ఆదర్శ ప్రజా రవాణా సంస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పొన్నం ప్రభాకర్ అన్నారు.

# ఫ్లోటింగ్ సోలార్‌పై ప్రత్యేక దృష్టి

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సౌర, ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తిని భారీగా ప్రోత్సహిస్తున్నామని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. ప్రధాన, మధ్యతరహా రిజర్వాయర్లపై ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని చెప్పారు.

నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల, శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి, మల్లన్నసాగర్, ఎల్ఎండీ, మిడ్‌మానేరు తదితర జలాశయాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. సాధారణ సోలార్ ప్లాంట్లతో పోలిస్తే ఫ్లోటింగ్ సోలార్‌కు అధిక వ్యయం అవుతోందని, కేంద్ర నిబంధనల కారణంగా అదనపు భారం పడుతోందని తెలిపారు. అయినప్పటికీ పెట్టుబడిదారులను ప్రోత్సహించి ఈ రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 2023 డిసెంబర్‌లో 15 వేల మెగావాట్ల నుంచి సెప్టెంబర్ 9 నాటికి 18,543 మెగావాట్లకు పెరిగిందని భట్టి తెలిపారు. వ్యవసాయ పంపుసెట్ల ఉచిత విద్యుత్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ.19 వేల కోట్లు సబ్సిడీగా భరిస్తోందన్నారు. భవిష్యత్ అవసరాలను తీర్చేందుకు సోలార్, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్‌పై దృష్టి సారిస్తున్నామని చెప్పారు.

అమ్రాబాద్ గిరిజన ప్రాంతంలోని 80 గ్రామాలను సోలరైజ్ చేసి మైక్రో గ్రిడ్ ఏర్పాటు చేసే పైలట్ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు వెల్లడించారు. 'ఇందిరా సౌర గిరి జల వికాసం' కింద గిరిజన ప్రాంతాల్లో సౌర విద్యుత్‌ను ప్రోత్సహిస్తామని తెలిపారు. రైతులు కూడా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు రావాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
గురువారం 10.09.2026

# 4 వేదిక
Peoples Voice

మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com




## వయసు పెరిగేకొద్దీ
# అర్థమయ్యే నిజాలు



వయసు పెరిగే కొద్దీ
మనకు సంవత్సరాలు మాత్రమే
పెరగవు..
మనుషుల్ని అర్థం చేసుకునే జ్ఞానం
కూడా పెరుగుతుంది.

చిన్నప్పుడు చాలా మంది మన
చుట్టూ ఉం డాలని కోరుకుంటాం..
వయసు పెరిగేకొద్దీ మాత్రం
మనసుకు నచ్చిన కొద్దిమంది
ఉంటే చాలు అనిపిస్తుంది.

చిన్నప్పుడు అందరూ మన గురించి
ఏమనుకుంటున్నారో
ఆలోచిస్తాం..
తర్వాత అర్థమవుతుంది
మన జీవితం మనం జీవించాలి,
ప్రతి ఒక్కరి మెప్పు కోసం కాదు.

చిన్నప్పుడు డబ్బు ఉంటేనే సంతో
షం అనుకుంటాం..
వయసు పెరిగేకొద్దీ
మనశ్శాంతి, ఆరోగ్యం,
కుటుంబం, మంచి మనుషులు
డబ్బుకంటే విలువైనవని
తెలుస్తుంది.

చిన్నప్పుడు గెలవడం ముఖ్యం అని
పిస్తుంది..
తర్వాత అర్థమవుతుంది
ప్రతి వాదనలో గెలవాల్సిన
అవసరం లేదు
కొన్ని చోట్ల మౌనంగా ఉండటమే
గొప్ప విజయం.

వయసు పెరిగేకొద్దీ
ఎవరైనా మనల్ని బాధపెట్టినప్పుడు
వెంటనే సమాధానం చెప్పాలనే
కోపం తగ్గుతుంది

ఎందుకంటే కాలమే
ఎవరు నిజమో, ఎవరు నటిస్తు
న్నారో
చాలా అందంగా చూపిస్తుంది.

మరో నిజం ఏంటంటే..
మన కష్టకాలంలో మనతో నిలిచిన
మనిషి
మన సంతోషంలో ఫోటో దిగిన
వందమందికంటే విలువైనవాడు.

మన కన్నీళ్లు చూసి
"ఏమైంది?" అని అడిగిన మనిషిని
ఎప్పటికీ మర్చిపోకూడదు.

వయసు పెరిగేకొద్దీ
బంధువులు ఎందరు ఉన్నారన్నది
కాదు..
మన బాధను అర్థం చేసుకునే
బంధం ఉందా లేదా అనేదే
ముఖ్యం.

ఇంకో విషయం..
మన దగ్గర ఉన్నది శాశ్వతం కాదు.
డబ్బు రావచ్చు.. పోవచ్చు.
పేరు రావచ్చు.. పోవచ్చు.
అందం తగ్గవచ్చు.
పదవి మారవచ్చు.

కానీ మనం ఒకరి జీవితంలో
మంచి జ్ఞాపకంగా మిగిలితే..
అది మాత్రం ఎప్పటికీ పోదు.

అందుకే వయసు పెరిగే కొద్దీ
అహంకారం తగ్గాలి..
ఆశలు తగ్గాలి..
కోపం తగ్గాలి..

ప్రేమ పెరగాలి..
క్షమించడం పెరగాలి..
మనశ్శాంతి పెరగాలి..
"నేను" కంటే "మనం" అనే
భావం పెరగాలి.

చివరికి వయసు మనకు నేర్పే
గొప్ప నిజం ఒక్కటే..

జీవితం ఎంతకాలం జీవించామ
న్నది కాదు..
ఎంతమందికి ప్రేమగా జీవించామ
న్నదే ముఖ్యం.

ఎందుకంటే..
వయసు పెరిగేకొద్దీ ముఖంపై
ముడతలు రావడం సహజం..
కానీ మనసులో మంచితనం
తగ్గకుండా ఉండటమే అసలైన
అందం.

## విత్తన గణపతిని
# పూజిద్దాం

ఈ వినాయకచవితిని ప్రజలు పర్యావరణహితంగా నిర్వహించుకోవాలని ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ పిలుపునిచ్చారు. పండుగ సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సంస్థ ఆయనకు విత్తన గణపతిని అందజేసింది. 'మన నగరం కలుషితం కాకుండా మట్టి లేదా విత్తన గణపతిని పూజిద్దాం. దీంతో మొక్కలు పెరుగుతాయి' అని విజయ్ సూచించారు. మన నగరాన్ని కాలుష్యం బారిన పడకుండా కాపాడుకునేందుకు ప్రతి ఒక్క రూ సురక్షితమైన మట్టి విగ్రహాలను, సీడ్ (విత్తన) విగ్రహాలను ఉపయోగించాలని ఆయన కోరారు. పండుగ ముగిసిన తర్వాత ఆ విగ్రహం ద్వారా ఒక మొక్క ఎదుగుతుందని, భక్తితో పాటు ప్రకృతిని కూడా కాపాడుకోవాలని విజయ్ దేవరకొండ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన ఈ పర్యావరణహిత కార్యక్రమానికి విజయ్ దేవరకొండ మద్దతు తెలిపారు.



# చవితి ఎప్పుడు చేసుకోవాలి
### సెప్టెంబర్ లో ముఖ్యమైన పండుగలు ఏవి?

హిందూ క్యాలెండర్ ప్రకారం శ్రావణ మాసంను అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈ మాసంలో ప్రత్యేక పూజలు వ్రతాలు నిర్వహిస్తారు. అయితే ఈ మాసం తర్వాత బాధపడ మాసం వస్తుంది. శ్రావణమాసం లాగే ఈ మాసంలో కూడా ముఖ్యమైన పండుగలు వస్తుంటాయి. వీటిలో వినాయక చవితి ప్రధానమైనది. తొమ్మిది రోజులపాటు గణనాథుడు వాడవాడలా భూలోకంలో పూజలు అందుకొని ఆ తర్వాత నిమజ్జనం అవుతాడు. ఈ తొమ్మిది రోజులపాటు ఆధ్యాత్మిక వాతావరణం ఎలా ఉంటుంది. ఈ పండుగతో పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వంటివి కూడా ఈ నెలలోనే రాబోతుంది. అయితే బాద్రపద మాసంలో ఈ పండుగలు ఏ తేదీలో రాబోతున్నాయి? అలాగే ఈ నెలలో ఉండే ముఖ్యమైన పండుగలు ఏవో చూద్దాం..

తెలుగు క్యాలెండర్ ప్రకారం శ్రావణమాసం ఆగస్టు 13న ప్రారంభమై సెప్టెంబర్ 11న ముగిస్తుంది. ఆ తర్వాత భాద్రపద మాసం ప్రారంభమవుతుంది. అయితే ఈ మాసం ప్రారంభం కి ముందే అంటే సెప్టెంబర్ నెల ప్రారంభంలోనూ కొన్ని ముఖ్యమైన పండుగలు ఉండలున్నాయి. వీటిలో సెప్టెంబర్ నాలుగున శ్రీకృష్ణ జన్మాష్టమి జరుపుకొనున్నారు. ఈరోజున శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేస్తూ ఉపవాస దీక్షలు చేస్తారు. వాడవాడలా ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. యువకులు అంతా ఉట్లు కొడుతూ ఉల్లాసంగా గడుపుతారు. ఈ పండుగ అందరినీ ఒక్క చోటు చేర్చి ఆనందంగా ఉంచుతుంది సెప్టెంబర్ 11న పొలాల అమావాస్య నిర్వహించుకోనున్నారు. ఈ పండుగకు గ్రామీణ ప్రాంతంలో ప్రాధాన్యత ఉంటుంది. కుటుంబ సభ్యులంతా సంతోషంగా గడపడానికి, పంటలు అభివృద్ధి చెందాలని కోరుకుంటూ పశువులతో కలిసి రైతులు ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. అలాగే మరి కొన్ని ఇళ్లల్లో కూడా పూజలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి రాబోతుంది. ఈ రోజున గణనాథుడు వాడవాడలో నెలకొని 9 రోజులపాటు పూజలు అందుకోనున్నాడు. ఇదే రోజున మహాగణపతి వాక్యార్థ సభ కూడా ఉండనుంది. వినాయక చవితి ప్రారంభం తర్వాత ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పూజలు ఉంటాయి. కొన్నిచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ సంతోషంగా గడుపుతారు.



ఈ నెలలో ఇవే కాకుండా ఉమామహేశ్వర వ్రతం, మహాలయ పక్షం, సంకటహర చతుర్థి వంటి ప్రత్యేక రోజులు కూడా రానున్నాయి. అందువల్ల శ్రావణంతోపాటు భాద్రపద మాసాన్ని పవిత్రంగా భావిస్తారు.




## నాగచైతన్య వృషకర్మ
# రిలీజ్ డేట్ ఫిక్స్

నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'వృషకర్మ'. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. స్పర్ష్ శ్రీవాస్తవ, జయరామ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాను డిసెంబర్ 4న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం గురువారం ప్రకటించింది. పురాణాంశాలతో మిళితమైన ఈ మిస్టిక్ హారర్ థ్రిల్లర్‌లో చైతన్య నిధి అన్వేషకుడిగా కనిపించనున్నారు. ఈ సినిమాకి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు.




## ఇరుముడి
# పట్టాలెక్కింది ఇలా?

రవితేజ హీరోగా 'శివ నిర్వాణ' దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇరుముడి' సినిమా ప్రేక్షకుల్లో విశేషమైన ఆదరణను రాబట్టుకుంటుంది. ఇప్పటికే ఈ సినిమా 180 కోట్లకు పైన కలెక్షన్స్ రాబట్టింది. ఏది ఏమైనా కూడా ఈ సినిమా 200 కోట్లకు పైన కలెక్షన్స్ ను రాబడుతుందనేది వాస్తవం. ఇక ఇలాంటి క్రమంలోనే రవితేజకి పెద్దగా మార్కెట్ లేదంటూ చాలా మంది చాలా రకాల కామెంట్లు చేశారు. కానీ మొత్తానికైతే ఆయన 200 కోట్ల మార్క్ ను అందుకోవడం అనేది నిజంగా చాలా గొప్ప విషయమనే చెప్పాలి. ఇక ఇలాంటి క్రమంలోనే 'ఇరుముడి' కథని శివ నిర్వాణ రవితేజ కంటే ముందు చాలా మంది హీరోలకు చెప్పాడు కానీ వాళ్లెవరూ ఆయన్ని నమ్మలేదు.

రవితేజ మాత్రం శివ నిర్వాణ చెప్పిన కథకి బాగా కనెక్ట్ అయిపోయి సినిమాని చేశాడు. అలాగే త్రినాథ్ రావు అనే పాత్రలో నటించి ఆ క్యారెక్టర్‌కు ప్రాణం పోశాడు. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలతో పాటు ఎమోషనల్ సన్నివేశాల్లో కూడా రవితేజ యాక్టింగ్ నెక్స్ట్ లెవెల్ లో ఉందంటూ ప్రతి ఒక్కరు అతని మీద ప్రశంసలు కురిపిస్తున్నారు. రవితేజ రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి కథలు చేస్తే ఆయనకు మరింత క్రేజ్ పెరుగుతుందని ప్రతి ఒక్క ప్రేక్షకుడు వాళ్ళ అభిప్రాయాలను తెలియజేస్తున్నారు. ఇక ఇదిలా ఉంటే శివ నిర్వాణ మాట్లాడుతూ రవితేజ ఈ కథని నమ్మకపోతే ఈ సినిమా బయటికి వచ్చుండేది కాదని అప్పటికే చాలామంది హీరోలు ఈ కథను రిజెక్ట్ చేయడంతో శివ నిర్వాణ ఈ కథను పక్కన పెడదామని అనుకున్నానని చెప్పాడు. కానీ మొత్తానికైతే రవితేజ కథను నమ్మి ఈ సినిమాను చేశాడు. దాంతో మా ఇద్దరికి పెద్ద సక్సెస్ దక్కిందని ఆయన కామెంట్స్ చేశాడు.






మొత్తానికైతే ఈ సినిమాతో మరోసారి హిట్ ట్రాక్ ఎక్కిన రవితేజ నెక్స్ట్ ఎలాంటి సినిమాలు చేస్తాడు ప్రేక్షకుల్లో ఒక అటెన్షియన్‌ను క్రియేట్ చేయగలిగే సినిమాలను చేయగలుగుతాడా? లేదంటే మళ్లీ రొటీన్ రొట్టా ఫార్ములా లోకే వెళ్లిపోతాడా అనేది తెలియాల్సి ఉంది. ఇక ప్రస్తుతం రవితేజ హసిత్ గోలి దర్శకత్వంలో ఒక సినిమాకి కనెక్ట్ అయ్యాడు. దీనిని దిల్ రాజు నిర్మిస్తుండటం విశేషం..

# మన నేల.. మన యాస!




తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు !

తొలకరి సినుకు మట్టి మీద వడితే అచ్చే కమ్మటాసన లెక్క...
మాట్లాడితే నోట్లెకెంచి ఊరే సక్కటి ఊట తెలంగాణ పలుకు!
బాయి కాడ మోట బొక్కెన సప్పడు,
సేను గట్టున నాగలి వట్టిన సేతుల సప్పడు
నాట్లేస్తూ అక్కాచెల్లెళ్లు పాడే పాటల సప్పడు ...
గివన్నీ కల్సి బుట్టిందే గీ యాస!
"ఏందిరా మల్లయ్యా... ఎటువోతున్నవ్?" అంటే
అది ఒట్టి పలకరింపు గాదు ,
'నీకు నేనున్నా' అనే ధైర్నం !
"గుక్కెడు గంజి తాగిపో బిడ్డా" అని ఇచ్చే అంబలి
సుక్కలల్ల
అచ్చమైన పల్లె కడుపు తీపి ఉంటది!
జొన్న రొట్టె, ఉల్లిపాయ నంజుకుని తిన్నట్టు
సాదసీదుంటది మా మాట...
గానీ అందుట్లున్న అనుబంధం
ఏ పట్నపు భాషల దొరకదు!
జీవాలు కాసేటోల్ల ఈల పాటలల్ల ,
చెరువుల ఈత కొట్టే పోరగాండ్ల అరుపులల్ల ,
అవ్వలు చెప్పే కతలల్ల
అమ్మలక్కల ముచ్చట్లల,
తెలంగాణ మట్టి గుబాళిస్తూనే ఉంటది!
గిది తరతరాల బతుకు ముద్దర ...
అవు గిప్పటిసందైన
మన యాసను గుండెలకు అదుముకుందం ,
మన తెలంగాణ భాషను
గర్వంగా బతికించుకుందం !
ఏమంటరుల్లా...



సాధన తేరాల, ఖమ్మం

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 11.09.2026
www.mudranews.in | @mudranews



**లోబీపీ : బీట్‌రూట్ తీసుకోండి**

బీట్‌రూట్‌లో సహజ నైట్రేట్లు ఉంటాయి. అయితే ఇవి రక్త నాళాలను విస్తరించి బీపీని మరింత తగ్గించే అవకాశం ఉన్నందున లో బీపీ ఉన్నవారు వైద్యుల సలహాతో మాత్రమే తీసుకోవడం మంచిది.



# వీరనారి చాకలి ఐలమ్మకు నివాళి





### కలెక్టరేట్లో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి:** గురువారం వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆమె వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ ఏఓ సునీల్, బీసీ సంఘాల నాయకులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యక్తులు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన ఐలమ్మ క్రిష్టాపురం గ్రామం, రాయపర్తి మండలం, వరంగల్ జిల్లాలో జన్మించిందని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. భూమి నాది.. పండించిన పంటనాది.. తీసుకెళ్లడానికి దొరెవ్వడు.. నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు.. అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రైతాంగ విప్లవాగ్ని చాకలి ఐలమ్మ అని వ్యక్తలు అన్నారు. 1940-44 మధ్య కాలంలో విస్నూర్ లో దేశ్ ముఖ్, రజాకర్ల అరాచకాల పై ఎదురు తిరిగి ఎర్రజెండా పట్టిందని తెలిపారు. ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ సెప్టెంబర్ 10, 1985న అనారోగ్యంతో మరణించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి కేశవ్ రామ్, రజక సంఘం ప్రెసిడెంట్ ఎం. అజయ్, కౌన్సిలర్ ఆంజనేయులు బి. సి. ఫ్రంట్ ఛైర్మన్ మల్లేష్ యాదవ్, ఆదిభట్ల మున్సిపల్ మాజీ ఛైర్మన్ నిరంజన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

**తాండూర్‌లో..**

**ముద్ర ప్రతినిధి, తాండూరు :** చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా తాండూరు బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు, తాండూర్ నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ మాట్లాడుతూ అన్యాయానికి ఎదురు నిలిచి ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆమె పోరాట చరిత్రను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. రజక సంఘం జిల్లా అధ్యక్షులు రజక కృష్ణ, వడ్డెర సమాజం జిల్లా అధ్యక్షులు వడ్డే సత్యనారాయణ, నాయి బ్రాహ్మణ సమాజం తాండూర్ అధ్యక్షులు పరమేష్ నాయి, దొమ్మా కృష్ణ, కేశవరావుతో పాటు బీసీ సంఘం నాయకులు జోసెఫ్, రాము ముదిరాజ్, పరమేష్, తాండ్ర నరేష్, మంతటి రాజు, శ్రీనివాస్, రఘువీర్, నరేందర్, విశ్వేశ్వర్, బిచ్చప్ప, బాబు రాజ్, నవీన్, దత్తాత్రేయ, చిన్న, సాయి, వివేక్, కిరణ్ పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి

## సీఎంను కలిసిన టీజీఈజేఏసీ



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ ఉద్యోగుల జేఏసీ (టీజీఈజేఏసీ) ప్రతినిధులు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. టీజీఈజేఏసీ ఛైర్మన్ వి. లచ్చి రెడ్డి, సెక్రటరీ జనరల్ ఒడ్నాల రాజశేఖర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యంగా పీఆర్సీ, పెండింగ్ డీఏల చెల్లింపు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లింది.సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు టీజీఈజేఏసీ నాయకులు తెలిపారు. వచ్చే సోమవారం జరిగే సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లపై సమగ్రంగా చర్చించి, పీఆర్సీ, డీఏ, సీపీఎస్ తదితర అంశాల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.ముఖ్యమంత్రి సానుకూల స్పందనపై టీజీఈజేఏసీ నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొంది.సీఎంను కలిసిన వారిలో టీజీటీఆర్ అధ్యక్షుడు ఎస్. రాములు, ప్రధాన కార్యదర్శి పాక రమేష్, టీజీఆర్ఎస్ఏ అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, జీపీవోఏటీజీఏ గరికె ఉపేంద్రరావు తదితరులు ఉన్నారు.

## గణపతి నవరాత్రి ఉత్సవాలకు సీఎంకు ఆహ్వానం



**ముద్ర, హైదరాబాద్:** శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా సికింద్రాబాద్ శ్రీ గణేష్ దేవాలయ కమిటీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని ఆహ్వానించింది.అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో దేవాదాయ శాఖ కమిషనర్, శ్రీ గణేష్ దేవాలయ కమిటీ అర్చకులు సీఎంను కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్తో పాటు పలువురు శాసనసభ్యులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం

### జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ వినాయక చవితికి ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, “మట్టి గణపతిని పూజిద్దాం... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం” అనే సందేశంతో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వినియోగాన్ని తగ్గించి, మట్టితో తయారు చేసిన గణనాథులను పూజించేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణ




కాలుష్యాన్ని నివారించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించ వచ్చని కలెక్టర్ తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ప్రజలకు సూచించారు.

# బీఆర్ఎస్ అంటేనే అబద్ధాల రాష్ట్ర సమితి

### కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, తోట లక్ష్మీకాంతారావు



**ముద్ర, హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర విమర్శలు చేశారు. 22ఏ అంశంపై చర్చకు బీఆర్ఎస్ నేతలు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు.ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ బీఆర్ఎస్ అసత్యాల పునాదిపై ఏర్పడిన పార్టీ అని విమర్శించారు. కేటీఆర్‌ను ఆ పార్టీకి ‘ఏఐ నాయకుడు’గా అభివర్ణిస్తూ, మీడియాలో వచ్చిన వార్తలను సైతం ఏఐ వీడియోలుగా ప్రచారం చేయడం ద్వారా తమ తప్పులను పరోక్షంగా అంగీకరించారని అన్నారు. గత పదేళ్లలో కేసీఆర్, కేటీఆర్ భూముల వ్యవహారాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే 22ఏ అంశంపై చర్చకు దూరంగా ఉంటున్నారని ఆరోపించారు. లాజిస్టిక్ పార్కుల పేరుతో భూముల వ్యవహారాలకు పాల్పడ్డారని, ప్రజల దృష్టిని మళ్లించేందుకు దళితుల అంశాన్ని తెరపైకి తెస్తున్నారని విమర్శించారు.ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ.. దళితుడు స్పీకర్‌గా ఉన్నారనే కారణంతో కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని ఆరోపించారు. స్పీకర్‌పై బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. దళితులు నడిచిన నేలను శుద్ధి చేయడం కుల దురహంకారానికి నిదర్శనమని విమర్శించారు.బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలిపై గవర్నర్, డీజీపీ విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తెలంగాణ ఉద్యమం కేవలం కేసీఆర్ వల్లే జరగలేదని, ఉద్యమంలో దళితుల పాత్ర కీలకమని అన్నారు. కేసీఆర్‌ను ‘తెలంగాణ జాతిపిత’గా ప్రచారం చేసుకోవడానికి ఆయన అర్హులు కాదని విమర్శించారు.

## సచివాలయంలో ఏసీబీ సోదాలు..

### లంచం తీసుకుంటూ పట్టుబడిన ఇద్దరు ఉద్యోగులు

**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్ సచివాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహించారు. సచివాలయ ఆవరణలోని ఆలయం వద్ద లంచం తీసుకుంటుండగా ఓ సెక్షన్ ఆఫీసర్‌తో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన రూ.2 లక్షల వ్యవహారంలో రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. డిమాండ్ చేసిన మొత్తంలో రూ.లక్ష తీసుకుంటుండగా సెక్షన్ ఆఫీసర్ వినోద్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్రను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.అనంతరం ఇద్దరినీ నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలు ఏసీబీ అధికారుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

## యూత్ కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జ్ గా జిట్టా రమ్యకృష్ణ

### అభినందించిన బండి రమేష్

**ముద్ర, కూకట్ పల్లి :** రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్ సంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమాదుర్గ భవన్‌లో గురువారం టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్ పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.అనంతరం జిట్టా రమ్యకృష్ణను బండి రమేష్ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. కూకట్ పల్లి నియోజకవర్గానికి చెందిన రమ్యకృష్ణ సంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. పార్టీలో ఆమె చేస్తున్న సేవలను, యూత్ కాంగ్రెస్ బలోపేతానికి ఆమె అందిస్తున్న




కృషిని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు జిట్టా సునీల్ కుమార్ యాదవ్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు అస్లాం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుశీల్ యాదవ్, కూకట్ పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు బుజ్జి, యశ్వంత్, భాను, సంతు, యోగి తదితరులు పాల్గొన్నారు.

## గ్రేస్ మార్కుల పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

### విద్యార్థుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్న న్యాయమూర్తి

**ముద్ర, కూకట్‌పల్లి :** జెఎన్‌టియుహెచ్ R22 రెగ్యులేషన్ విద్యార్థులకు గ్రేస్ మార్కులు మంజూరు చేయాలని కోరుతూ 'స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం' తరపున తెలంగాణ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై రెండో విచారణ గురువారం జరిగింది. జస్టిస్ జువ్వాది శ్రీదేవి సమక్షంలో ఈ విచారణ కొనసాగింది. విచారణ సందర్భంగా R22 విద్యార్థులు ఎదుర్కొం టున్న సమస్యలు, గ్రేస్ మార్కుల ఆవశ్యకతను ధర్మాసనం నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకుంది. విద్యార్థి శ్రీహాస్ తమ ఆవేదనను న్యాయమూర్తికి వివరిస్తూ కొద్దిపాటి మార్కుల తేడాతో డిగ్రీ పూర్తి చేయలేకపోతున్నామని, దీనివల్ల ఉ న్నత విద్య అవకాశాలు, ఉద్యోగ అవకా శాలు దెబ్బ తింటున్నాయని తెలిపారు. గ్రేస్ మార్కులు మంజూరు చేయడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల వాదనలు విన్న అనంతరం, ఈ అంశంపై పూర్తి వివరణ (కౌంటర్) దాఖలు చేసేందుకు జెఎన్‌టియు హెచ్ అధికారులు మరింత సమయం కోరారు. దీంతో స్పందించిన హైకోర్టు, తదుపరి విచారణను సెప్టెంబర్ 18కి వాయిదా వేసింది. ఈ సందర్భంగా ఎస్ పి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను హైకో పరిగణనలోకి తీసుకోవడం శుభపరిణామమని అన్నారు. న్యాయస్థానంపై తమకు పూర్తి నమ్మకం ఉందని, విద్యా ర్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరా టం ప్రజాస్వామ్య బద్ధంగా కొనసాగుతుం దని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకుని కూడా సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

## హోమ్ ల్యాండ్ అధినేత రాంరెడ్డి ఆత్మహత్య



**ముద్ర, సంగారెడ్డి:** ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ హోమ్ ల్యాండ్ అధినేత రాంరెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.నేదునూరు గ్రామంలోని తన స్వగ్రామ ఫామ్‌హౌస్‌లో రాంరెడ్డి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. పఠాన్‌చెరు పరిధిలో సుమారు 250 ఎకరాల్లో నూతన వెంచర్ చేపట్టేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.అయితే రాంరెడ్డి ఆత్మహత్యకు అసలు కారణాలు ఏమిటన్నది ఇంకా స్పష్టంగా తెలియ రాలేదు. రియల్ ఎస్టేట్ వ్యవహారాలకు సంబంధించి రాజకీయ నాయకుల నుంచి ఒత్తిళ్లు ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. ఈ కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.ఆత్మహత్యకు దారితీసిన పూర్తి కారణాలు, ఇతర వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఆత్మహత్యలు వద్దు.. ధైర్యంగా ఉండండి

### డీజీపీ సీవీ ఆనంద్

**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 10:** ఆన్‌లైన్ బెట్టింగ్ ఉచ్చులో పడి అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడవద్దని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన పోలీసు సిబ్బందిని ఉద్దేశించి ప్రత్యేక సందేశం విడుదల చేశారు.గత నాలుగు నెలల్లో తెలంగాణ పోలీసు శాఖకు చెందిన ఇద్దరు సిబ్బంది ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు తనను తీవ్రంగా కలచి వేశాయని డీజీపీ తెలిపారు. యువ, మధ్య వయస్కులైన కానిస్టేబుళ్లు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం మరింత బాధాకరమన్నారు.ఈ ఘటనలపై జరిపిన విచారణలో ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పులపాలవడమే ప్రధాన కారణంగా తేలిందని తెలిపారు. కొందరు భూములు విక్రయించగా, మరికొందరు స్నేహితులు, సహోద్యోగుల వద్ద అప్పులు చేశారని, ఇంకొందరు అధిక వడ్డీకి డబ్బులు



తీసుకున్నారని వివరించారు.వ్యసనాలకు దూరంగా ఉండాలిఆర్థిక ఇబ్బందులు, అప్పుల ఒత్తిడి ఎదురైనప్పుడు ఆత్మహత్యే పరిష్కారమని భావించవద్దని డీజీపీ సూచించారు. తమ ఆర్థిక పరిస్థితి, అప్పుల వివరాలను జీవిత భాగస్వామి, కుటుంబ సభ్యులకు దాచిపెట్టకుండా వారితో పంచుకోవాలని కోరారు.పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై శాఖ ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని తెలిపారు. సమస్యలు ఎదురైనప్పుడు వాటిని దాచిపెట్టకుండా ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్‌తో పాటు మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.93 వేల మంది పోలీసు సిబ్బందికి విజ్ఞప్తితెలంగాణ పోలీసు శాఖలోని సుమారు 93 వేల మంది సిబ్బందికి డీజీపీ ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. మీపై ఆధారపడిన కుటుంబ సభ్యులు, పిల్లలు, తల్లిదండ్రుల గురించి ఆలోచించాలని సూచించారు. మీకు ఏ సమస్య ఎదురైనా ఆత్మహత్యకు పాల్పడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని, అవసరమైన సహాయం కోసం అధికారులను సంప్రదించాలని కోరారు.

## తాండూర్ పట్టణం సమీపంలో రోడ్డు ప్రమాదం

### ఒక విద్యార్థి దుర్మరణం మరో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు

**ముద్ర ప్రతినిధి, తాండూరు :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి సమీపంలోని అంతారం బైపాస్ రోడ్డు వద్ద గురువారం సాయంత్రం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పెద్దేముల్ మండలంలోని గో ట్లపల్లి మోడల్ స్కూల్ లో చదువుకుంటున్న ముగ్గురు విద్యార్థులు స్కూలు విడిచిన తర్వాత తాండూర్ పట్టణంలోని తమ సొంత ఇళ్లకు స్కూటీపై బయలుదేరగా అంతారం సమీపంలో ఎదురుగా వచ్చిన డీసీఎం వాహనం వీరి స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీని నడుపుతున్న పదవ తరగతి విద్యార్థి సాత్విక్ అక్కడికక్కడే దుర్మరణం పాలవగా తొమ్మిదవ తరగతి చదువుకుంటున్న వడ్డె శేఖర్, గోవర్దన్ అనే ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరు విద్యార్థులను తాండూరు జిల్లా దవఖానకు తరలించి ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. తాండూర్ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

## లోబీపీ : వెంటనే లేచి నిలబడకండి

పడుకున్నా, కూర్చున్నా ఒక్కసారిగా లేవకుండా నెమ్మదిగా నిలబడండి. తల తిరుగుతున్నప్పుడు కూర్చోవడం లేదా పడుకోవడం ద్వారా పడిపోవడం వంటి ప్రమాదాలను నివారించవచ్చు.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**ముద్ర, చిగురుమామిడి,** : చిగురుమామిడి మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్ కుటుంబం అనాథగా మారడంతో వారి ఇద్దరు కూతుర్లకు రవీందర్ పోలీస్ శాఖలు విధులు నిర్వహించిన 1999 బ్యాచ్ పోలీసు విభాగం అధ్యక్షుడు వావిలాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో వారి నివాసంలో రూ.లక్ష నగదు గురువారం అందజేశారు. గీకురు రవీందర్ పోలీస్ శాఖలో ఉన్న తమతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో సిరిసిల్లలో పోలీసు ఉద్యోగం వదిలి రాజకీయంపై ఉన్న మక్కువతో సర్పంచ్ గా రెండు పర్యాయాలు గెలుపొందారని, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేశారని గుర్తు చేశారు.మాజీ జడ్పీటీసీగా మండలంలో సేవలందించాలని కొనియాడారు. అనాథలైన ఇద్దరి కూతుళ్లకు అన్ని విధాల అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. భవిష్యత్ లో పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని అన్నారు. నగదు అందజేసిన వారిలో గుండ కృష్ణ కుమార్ గౌడ్, పుప్పాల శ్రీనివాస్, శంకర్ రెడ్డి, ముత్యాల బ్రహ్మయ్య, కనకయ్య, దామోదర్ రెడ్డి, కాంతారావు, సదాచారి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఎండీ ఠాణాలో ఉద్రిక్తత..

**- మొగిలిపాలెం సర్పంచ్ కు మద్దతుగా వెళ్లిన గ్రామస్తులపై జులుం**



**ముద్ర, కరీంనగర్** : కరీంనగర్ జిల్లా ఎల్ ఎండీ పోలీస్ స్టేషన్ లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మొగిలిపాలెం సర్పంచ్ పై కాంగ్రెస్ నాయకుడి దాడి నేపథ్యంలో సర్పంచ్ అనుచరులు గ్రామస్తులు మద్దతుదారులతో వెళ్లారు. కాగా కొంతమంది యువకులు దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు బయటకు వెళ్లాలని సూచించడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది.బాధితులమైన తమపైనే పోలీసులు జులుంగా వ్యవహరించారని యువకులు ఆరోపించారు. పోలీసుల తీరుపై స్టేషన్లోనే నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు జోక్యం చేసుకొని యువకులకు నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. బాధితుల పక్షాన ఉండాల్సిన సీఐ రమేష్, పోలీసులు తమపైనే దురుసుగా ప్రవర్తించారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

## మొగిలిపాలెం సర్పంచ్ పై కాంగ్రెస్ నాయకుడి దాడి



**ముద్ర, తిమ్మాపూర్,** : కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం లో కాంగ్రెస్ నాయకుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గురువారం ఉదయం తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామ సర్పంచ్ దాట్ల తిరుపతిపై మస్తులాపూర్ సొసైటీ చైర్మన్ కాంగ్రెస్ నాయకుడు మోరపల్లి రమణారెడ్డి దాడి చేసి గాయపరిచాడు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గ్రామ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ తో పాటు సొసైటీ చైర్మన్ వెళ్లారు. ఈ క్రమంలో పాత కక్షలు పెట్టుకున్నా రమణారెడ్డి.. సర్పంచ్ తిరుపతి రాగానే కట్టెతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు.

గ్రామస్తులు అడ్డుకొని వివాదాన్ని సద్దుమణిగించారు. తీవ్రంగా గాయపడ్డ తిరుపతి ఎల్ఎండీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్ పైనే దాడి చేస్తే తమ పరిస్థితి ఏంటి అనే ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచుల ఫోరం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు రావుల రమేష్, దేవేందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, సంపత్, సర్పంచులు పొన్నం సునీత అనిల్ గౌడ్, ఆంజనేయులు, గుజ్జుల శ్వేతా ప్రణీత్ రెడ్డి, కనకం లక్ష్మీ కొమురయ్య, శ్రీనివాస్, సతీష్, తదితరులు తిరుపతికిమద్దతుగా వచ్చారు.

## ప్రేమ పెళ్లి.. గద్వాలలో జేసీబీలతో యువకుడి ఇంటి కూల్చివేత

**ముద్ర న్యూస్, గద్వాల:** జోగులాంబ గద్వాల జిల్లాలో దారుణం చోటుచేసుంది. ప్రేమ వివాహం చేసుకున్న దళిత యువకుడి ఇంటిని యువతి కుటుంబ సభ్యులు కూల్చేశారు. గద్వాల మండలం రేపల్లెలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ యువతి, యువకుడు ఇటీవల హైదరాబాద్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు ఆగ్రహంతో యువకుడి ఇంటిపై దాడికి పాల్పడ్డారు. జేసీబీలతో ఇంటిని కూల్చివేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు అక్కడికి చేరుకున్నారు.

## ఫాంహౌస్‌లో ప్రముఖ రియల్టర్ ఆత్మహత్య

**ముద్ర, రంగారెడ్డి** : రంగారెడ్డి జిల్లాలో ప్రముఖ రియల్టర్, హ్యోమ్ ల్యాండ్ అధినేత రాంరెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. కందుకూరు మండలం నేదునూరులోని ఫాంహౌస్‌లో ఆయన ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. పటాన్‌చెరులో 280 ఎకరాల్లో రాంరెడ్డి నూతన వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో రాజకీయ నాయకుల ఒత్తిడితో ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.

# విద్యుత్ కోతలపై రైతుల రాస్తారోకో..

**రాయికల్‌లో కాలిన మోటార్లతో రహదారిపై నిరసన డిమాండ్ చేశారు**



**ముద్ర, రాయికల్** : రైతులకు ప్రకటించిన విద్యుత్ సరఫరాలో కోతలు విధించడాన్ని నిరసిస్తూ పలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు గురువారం రాయికల్ పట్టణంలో ఆందోళనకు దిగారు. పట్టణంలోని విద్యుత్ ఉపకేంద్రం ఎదుట ఉన్న జగిత్యాల-రాయికల్ ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ కోతల కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలిపోయిన విద్యుత్ మోటార్లను రహదారిపై ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. వ్యవసాయానికి కనీసం 12 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు

విద్యుత్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు పునరుద్ధరిస్తారో రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై సుధీర్‌రావు, విద్యుత్ శాఖ జగిత్యాల రూరల్ ఏడీఈ సింధూర శర్మ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ నెల 20లోగా సమస్యలను పరిష్కరించాలని రైతులు విద్యుత్ అధికారులను కోరారు. అప్పటిలోగా సమస్యలు పరిష్కారం కాకపోతే రహదారిపై వంటావార్పు తదితర కార్యక్రమాలు చేపట్టి ఆందోళనను ఉధృతం చేస్తామని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి బెయిల్ రద్దు చేయండి

**కోర్టులో పోలీసుల పిటిషన్**

**ముద్ర, హైదరాబాద్:** స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో భారాస ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్‌రెడ్డికి లభించిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ సైఫాబాద్ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు విధించిన బెయిల్ షరతులను నిందితులు ఉల్లంఘించారని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. బెయిల్‌పై బయటకు వచ్చిన అనంతరం కోర్టు నిబంధనలకు బేఖాతరు చేస్తూ వారు మీడియా పాయింట్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో అనుచిత వ్యాఖ్యలు చేశారని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లు, డిజిటల్ ఆధారాలను సమర్పించారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు వెంటనే బెయిల్ రద్దు చేయాలని కోరారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు నమోదై ఉన్నాయని పోలీసులు గుర్తుచేశారు. అందుకే ఈ కేసును తదుపరి విచారణ నిమిత్తం ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టుకు బదిలీ చేయాలని పోలీసులు నాంపల్లి కోర్టును కోరారు.

## తిరుమల శ్రీవారికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం



**ముద్ర, తిరుమల:** తిరుమల శ్రీవారికి గురువారం రికార్డు స్థాయిలో రూ.6.93 కోట్ల హుండీ కానుకలు లభించాయి. బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వచ్చిన హుండీ కానుకలను గురువారం లెక్కించగా ఈ కానుకలు లభించాయి. తితిదే (TTD) చరిత్రలో ఇప్పటి వరకు మూడు సార్లు మాత్రమే ఒక్కరోజులో రూ.6 కోట్లకు పైగా హుండీ కానుకలు లభించిన రికార్డు ఉంది. కొందరు అజ్ఞాత భక్తులు భారీగా హుండీ కానుకలు వేయడంతో ప్రస్తుత రికార్డు నమోదైనట్లు సమాచారం.

**ఆదివారం వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు**

మరోవైపు శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగిన నేపథ్యంలో ఆదివారం వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు తితిదే గురువారం ప్రకటించింది. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు వరుస సెలవులు ఉండటంతో రద్దీ మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో 13వ తేదీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు తితిదే ప్రకటించింది. ఆ సమయాన్ని సామాన్య భక్తులకు కేటాయించనున్నారు. దీంతో శనివారం భక్తుల నుంచి ఎలాంటి సిఫారసు లేఖలు స్వీకరించరు.

## ఫ్లాష్ సర్వే.. బీఆర్ఎస్‌పైనే ప్రజల్లో వ్యతిరేకత

**- సీఎం రేవంత్**



**ముద్ర, హైదరాబాద్:** అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గత మూడురోజులుగా జరిగిన పరిణామాలపై ప్రభుత్వం ఫ్లాష్ సర్వే చేయించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతల తీరునే ప్రజలు తప్పుబట్టినట్లు సర్వేలో వెల్లడైందన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత లేనట్లు తేలిందని చెప్పారు. ఈనెల 7న అసెంబ్లీ గేటు వద్ద జరిగిన పరిణామాలు, స్పీకర్‌ను దూషించడం, ఎర్రవల్లిలో జరిగిన శుద్ధీకరణ తదితర ఘటనలను ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించినట్లు సమాచారం. అనంతరం ప్రభుత్వం తీసుకున్న చర్యలు తదితర అంశాలను ఆయన వివరించినట్లు తెలుస్తోంది.

## చెరువుల్లో నిమజ్జనాలకు మేం వ్యతిరేకం కాదు

**హైడ్రా కమిషనర్ రంగనాథ్**



**ముద్ర, హైదరాబాద్:** నగరంలో గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. చెరువుల్లో నిమజ్జనాలకు హైడ్రా వ్యతిరేకం కాదన్నారు. సోషల్ మీడియాలో హైడ్రా పై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. "కేంద్రం నోటిఫై చేసిన 4–5 చెరువుల్లోనే గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలు ఉన్నాయి. అమీన్‌పూర్, కాప్రా చెరువుల్లో ఆంక్షలు విధించారు. దేశంలో ప్రప్రథమంగా అమీన్‌పూర్ చెరువును బయోడైవర్సిటీగా, నేచురల్ వెట్‌ల్యాండ్ కింద కాప్రా చెరువును కేంద్రం గుర్తించింది. హైడ్రా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద ఎలాంటి ఆంక్షలు లేవు. మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం. పీవోపీ విగ్రహాల నిమజ్జనం కోసం ప్రతి చెరువు వద్ద ప్రత్యేక స్థలం కేటాయిస్తున్నాం" అని రంగనాథ్ తెలిపారు.

## ఏనుగు మెడకు ట్రాక్టర్ టైరు..

అస్సాం గోలాఘాట్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఓ అసాధారణ పరిణామం చోటుచేసుకుంది. మోరోంగి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల్లో ఒకదాని మెడకు భారీ టైరు చిక్కుకుపోయి కనిపించింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మృణాల్ సైకియా.. అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు ఏనుగు మెడలో టైరు తొలగించేందుకు కొన్ని గంటలపాటు శ్రమించారు.

## సీఎంను కలిస్తే కాంప్రమైజ్.. లేకపోతే గ్యాప్ అంటారు

**- రాజగోపాల్‌రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్:** నిధుల కోసం సీఎం రేవంత్ ను కలిస్తే తప్పేంటని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధి జరగాలంటే సీఎం, డిప్యూటీ సీఎంను కలవాల్సిందేనని చెప్పారు. సీఎంతో తనకు అభిప్రాయబేధాలు మాత్రమే ఉన్నాయన్నారు. మంచి జరిగితే మంచి.. చెడు జరిగితే చెడు అని చెప్పడం తన నైజమన్నారు. మీడియాతో రాజగోపాల్‌రెడ్డి చిట్‌చాట్ నిర్వహించారు. "సీఎం రేవంత్, నేను ఎప్పుడూ తిట్టుకోవాలని కొందరు చూస్తున్నారు. మంత్రి పదవి కోసం సీఎం దగ్గర రాజీపడినట్లు ప్రచారం చేస్తున్నారు. మంత్రి పదవి ఇచ్చేది అధిష్ఠానం. ఆ పదవి ఇస్తానని హైకమాండ్ మాటిచ్చింది. అధిష్ఠానం ఏం చెబితే అది చేయడానికి సిద్ధంగా ఉన్నా. సీఎంను కలిస్తే కాంప్రమైజ్.. కలవకపోతే గ్యాప్ పెరిగిందని ప్రచారం చేస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజం. కొండా సురేఖ విషయంలో అధిష్ఠానానికి సీఎం రేవంత్ చెప్పడంలో తప్పేమీ లేదు. ఇందిరమ్మ ఇళ్లకు ఇచ్చే రూ.ఐదు లక్షలు చిన్నమొత్తమేమీ కాదు" అని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## బ్రిక్స్ సదస్సు: సస్పెన్స్‌కు తెర.. భారత్‌కు జిన్‌పింగ్!



**ముద్ర, ఢిల్లీ :** చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్ పర్యటన విషయంలో కొనసాగుతోన్న సస్పెన్స్‌కు తెరపడింది. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు రానున్నారు. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ రంగ మీడియా సంస్థ జిన్హువా వెల్లడించింది. దేశ రాజధాని దిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది . ఈ సదస్సుకు మిగతా సభ్య దేశాల అగ్రనేతలు హాజరవుతుండగా.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాకపై మాత్రం తొలి నుంచి సందిగ్ధతే నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే, తమకు కూడా ఎలాంటి అధికారిక సమాచారం లేదని అంతకుముందు చైనా విదేశాంగ శాఖ చెప్పడంతో.. అసలు జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సుకు వస్తారా? లేదా? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. చివరకు జిన్‌పింగ్ పర్యటనపై చైనా అధికారిక మీడియా నుంచి ప్రకటన వెలువడడం గమనార్హం.

భారత్–చైనా మధ్య దశాబ్దాలుగా సరిహద్దు విభేదాలు నెలకొన్నాయి. 1962లో యుద్ధం వీటికి నాంది పలికిందని చెప్పొచ్చు. 2020లో గల్వాన్ ఘర్షణతో అవి మరింత తీవ్రరూపం దాల్చాయి. అయితే ఈ మధ్యకాలంలో రెండు దేశాలు కాస్త పట్టువిడుపులు ప్రదర్శిస్తున్నట్లు కనిపిస్తోంది. గతేడాది షాంఘై సహకార సదస్సు (SCO)కు ప్రధాని మోదీ హాజరైన సంగతి తెలిసిందే. ఇక ఈ బ్రిక్స్ సదస్సుకు ముందు మోదీ, జిన్‌పింగ్ ప్రత్యేకంగా భేటీ అయి ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### లోబీపీ : ఎండుద్రాక్ష తినండి

ఎండుద్రాక్షలో సహజ చక్కెరలు, పొటాషియం వంటి పోషకాలు ఉంటాయి. నానబెట్టిన ఎండుద్రాక్షను పరిమితంగా తీసుకోవచ్చు.



# వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శం

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శం అని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని... వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశం మందిరంలో వర్ధంతి కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన చాకలి ఐలమ్మ సేవలు మరువ లేనివి అని అన్నారు.తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి అని కొనియాడారు. చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని, ఆమె ఆశయాల సాధనకు కృషిచే యాలని పిలుపునిచ్చారు. ఆమె ధీర చరిత్ర ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొంది ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు.ఈ కార్యక్రమం జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి సుబ్బారెడ్డి వివిధ కుల సంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



### చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

**ముద్ర, మోత్కూర్:** తెలంగాణ తొలి భూ పోరాటానికి పేదల పక్షాన ప్రతీకగా నిలిచిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి చాకలి (చిట్యాల ) ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం స్థానిక శ్రీకాంత్ చౌరస్తా వద్ద ఐలమ్మ 41వ,వర్ధంతిని పురస్కరించుకొని బీసీ రిజర్వేషన్ సాధన సమితి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం పరిపాలనలో భూస్వాములు, పెత్తందారులు పేద ప్రజలను పీడిస్తూ వేధిస్తున్న క్రమంలో తన ధైర్యశాలిగా పేదల పక్షాన అండగా నిలబడ్డారని ఆమె సేవలను కొనియాడారు. దొరలు, రజాకార్ల ఆగడాలను వారి పోరును ఎదిరించిన బహుజన వీరవనిత ఐలమ్మ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్ నేత, పట్టణ అధ్యక్షులు నిలిగొండ మత్స్యగిరి, మండల నాయకులు పురుగుల శ్రీనివాస్, మహేష్ ,అనిల్ పాల్గొన్నారు.

### ఖమ్మంలో..

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 10 :** సమాజంలోని అస మానతలకు ఎదురొడ్డి నిర్భయంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట పటిమ అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న ఐలమ్మ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జమీందార్ల పాలనలో వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, తెలంగాణ భూ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన తెగువ చరిత్రలో నిలిచి పోయిందని కొనియాడారు. కార్యక్రమంలో ముదిగొండ సొసైటీ చైర్మన్ ఎలగొండ స్వామి, బీసీ, రజక కులసంఘాల నాయకులు, సంక్షేమాధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.









### సిపిఎం కార్యాలయంలో

వీరనారి ఐలమ్మ 41వ వర్ధంతి సభను జిల్లా ఆఫీస్ కార్యదర్శి ఆర్. ప్రకాష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, భూస్వాముల దోపిడీకి, విసునూరు దొరల నిరంకుశ త్వానికి వ్యతిరేకంగా పోరాడిన ధీరవనిత చిట్యాల ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను మత రంగు పులిమి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బుగ్గవీటి సరళ, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనా రాయణ, నవీన్ రెడ్డి, రమణ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ కార్యాలయంలో..

తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పేర్కొన్నారు. సిపిఐ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా ఉద్యమాలను నిర్మించడమే ఐలమ్మకు ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, లతాదేవి, కార్యవర్గ సభ్యులు కళావతి, వెంకటేశ్వరరావు, రామాంజ నేయులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత సమాజానికి తక్షణమే కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి



**ముద్ర, మోత్కూర్:** భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో కుల పిచ్చితో రెచ్చగొట్టి యావత్ దళితుల ఆత్మగౌరవాన్ని కించపరుచుటకు ఉసిగొల్పిన కేసీఆర్ తక్షణమే దళిత సమాజానికి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్ డిమాండ్ చేశారు .ఈ సందర్భంగా బాలరాజు గౌడ్ మాట్లాడుతూ,ప్రత్యేక తెలంగాణ సాధనలో దళితుల దప్పు లేనిదే నీ ఉద్యమం లేదనే విషయం మరవొద్దని, దళిత ముఖ్యమంత్రి పేరుతో దళితులను దగా చేసిన ఘనుడివి నీవేనని నేడు నీ బిఆర్ఎస్ కుల అహంకార చర్యలు రెండు కూడా ఒక్కటే అని, మీ రెండు పార్టీల మధ్య సిద్ధాంతపరమైన తేడా లేదని దళితుల విషయంలో ఇరు పార్టీల వైఖరి ఒకటేనని స్పష్టమౌతుంది. ఇది కేవలం ఒక రాజకీయ పార్టీపై విమర్శ కాదు, దళిత సమాజాన్ని అవమానపరిచి,అంటరానితన భావజాలాన్ని ప్రోత్సహించే ప్రమాదకరమైన చర్యగా భావిస్తూ, కేసిఆర్ నిజంగా దళితుల పట్ల గౌరవం కల్గిన నాయకుడైతే , తన ఫామ్ హౌస్ వద్ద దళితులు నిరసన తెల్పిన ప్రదేశాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయించిన ఘటనపై వెంటనే స్పందించి,ఈ దుర్మార్గపు చర్యలకు పాల్పడిన తమ పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవడంతో పాటు యావత్ దళిత సమాజానికి తక్షణమే క్షమాపణలు చెప్పాలని బహుజనుల పక్షాన హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్, నాయకులు బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి,బద్దం నాగార్జున్ రెడ్డి, గడ్డం సోంనర్సయ్య, లెంకల వేణు, గణగాని నర్సింహా, గడ్డం లక్ష్మయ్య, కందుకూరి మురళీ, వివిధ గ్రామ శాఖ ల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను అవమానించడం అత్యంత నీచమైన రాజకీయ సంస్కృతిముద్ర, మోత్కూర్:బీఆ ర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్ గడ్డం ప్రసాద్ పై చేసిన అవమానకర వ్యాఖ్యలను బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కొంపల్లి గణేష్ తీవ్రంగా ఖండించారు.రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ పదవిని కించపరచడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని అన్నారు. దళిత స్పీకర్‌ను అవమానించేలా మాట్లాడటం బీఆర్ఎస్ అహంకార రాజకీయా లకు నిదర్శనమని మండిపడ్డారు.తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కొంపల్లి గణేష్ డిమాండ్ చేశారు.

# అంగన్వాడీ కేంద్రంలో భూషణం ఉత్సవాలు



**ముద్ర, మోత్కూర్:** మండలంలోని పాటిమట్ల అంగన్వాడి కేంద్రంలో 9వ జాతీయ పోషణ మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ పోషణ మాస ఉత్సవాలు సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు జరుపు కోవడం జరుగుతుందని పోషణ మాసం సందర్భంగా గర్భిణీ స్త్రీలు పోషకాలు గల ఆహారం తీసుకోవాలని ప్రోటీన్ లు ఉన్న ఎక్కువ పదార్థాలు తీసుకోవాలని ఏఎన్ఎం అంజమ్మ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ లోపం లేకుండా ఐరన్ ఎక్కువగా ఉండే ఆకుకూరలు, పాలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలని పిల్లలకు కూడా పోషణ లోపం లేకుండా బాల అమృతం, ఆకుకూరలు ప్రతిరోజు పప్పు దినుసులు పెట్టాలని తల్లులకు తెలిపారు. గ్రామంలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలందరూ గవర్నమెంట్ అందిస్తున్న ఆహార పదార్థాలను అందరు వినియోగించుకోవాలని వృధా చేయకూడదని గర్భిణీ స్త్రీలందరూ మంచి పోషకాలు గల ఆహారాలు తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రిలోనే నార్మల్ డెలివరీ కావాలని సర్పంచి బండ రమా తెలిపారు. ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన వేడుకను జరిపించడం జరిగింది. అంగన్వాడి టీచర్ ఎం పుష్పలత, వివో సభ్యులు బండి మానస, అనిత ,ఆశ వర్కర్ రేణుక,చిన్న పిల్లల తల్లులు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



### మాజీ ఎంపీ నామ

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 10 :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు పోరాటం చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలను, శాసనసభ నుండి బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌ను ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఒక ప్రజాప్రతినిధి కేసీఆర్ మరణాన్ని కోరుకుంటున్నట్లు మాట్లాడటం అత్యంత బాధ్యతారాహిత్యమని, దీనిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల భద్రతపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.ప్రజా సమస్యలపై సభలో ప్రశ్నించే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఈ సెషన్ ముగిసే వరకు సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని నామ మండిపడ్డారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడం వల్ల ప్రజా సమస్యలపై సమగ్ర చర్చ జరగకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల హామీలను, ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రశ్నించే వారిపై విమర్శలు మానుకుని ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని హితవు పలికారు.

# 22ఏ భూములకు విముక్తి కల్పించాలి

### కలెక్టరేట్ ఎదుట బీజేపీ ధర్నా



**ముద్ర ప్రతినిధి,ఖమ్మం, సెప్టెంబరు 10 :** నిషేధిత 22ఏ జాబితా వల్ల దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి రైతుల భూములకు వెంటనే విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ రికార్డుల్లో ఒకలా,నిషేధిత జాబితాలో మరోలా ఉండటంతో రైతులు తమ సొంత భూములను అత్యవసరాలకు విక్రయించుకోలేక ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖను పర్యవేక్షిస్తూ, సొంత జిల్లాలోనే ఈ సమస్యను పరిష్కరించడంలో విఫలమైన మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా రామావత్ సేవ నాయక్



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుర్రపు తండ గ్రామపంచాయతీకి చెందిన రామావత్ సేవ నాయక్ నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యడవెల్లి వెంకటస్వామి ఆయన నియమకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, రాష్ట్ర అధ్యక్షులు యడవెల్లి వెంకటస్వామికి, జాతీయ ఎన్.ఎస్.యు.ఐనా యకులు ఎండి అక్బర్, యువనేత నేనావత్ దేవరన్ నాయక్ లకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని విద్య రంగా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

# డిజిటల్ క్రాప్ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి



**ముద్ర, మోత్కూర్:** డిజిటల్ క్రాప్ సర్వే ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు వి కీర్తి తెలిపారు. గురువారం మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని ధర్మపురం లో పంట నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారిని వి కీర్తి పర్యవేక్షించి అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒకరు చొప్పున ప్రైవేట్ సర్వేయర్లను గుర్తించి వారిద్వారా పంటల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ సర్వేయర్ ప్రతి సర్వే నెంబర్ వద్దకు వెళితే అక్కడ ఆప్ ఓపెన్ అయి పంటను రెండు ఫోటోలతో అప్లోడ్ చేయగా పంట రకము విస్తీర్ణం నమోదు చేయబడతాయి ఇలా నమోదు కాబడిన రైతులకు సంక్షిప్త సమాచారము మెసేజ్ రూపంలో సంబంధిత రైతుకు చేరుతుంది ఈ సర్వే నిర్వహించే సమయంలో సంబంధిత రైతు అందుబాటులో ఉండి పంట నమోదు చేయించుకోవాలని సంక్షిప్త సమాచారము ఫోన్ కి రాగానే మూడు రోజుల లోపు ఏదైనా మార్పు ఉన్నచో సంబంధిత ఏఈఓ ను సంప్రదించగలరని దాచారం గ్రామం రైతులకు మండలము అడ్డగూడూరు గా మెసేజ్ వస్తుంది ఇది సాంకేతిక లోపమే కానీ రైతులకు వేరే ఇతర ఇబ్బందులు తలెత్తవని ఆమె తెలిపారు.

# 12న మహిళా సదస్సు : పోస్టర్ ఆవిష్కరణ



**ముద్ర ప్రతినిధి యాదాద్రి భువనగిరి :** ఈనెల 12 శనివారం భువనగిరి పట్టణంలోని ఏ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా నిర్వహించే మహిళా అవగాహన సదస్సు కార్యక్రమం పోస్టర్ ను గురువారం జలీల్ పుర మసీదు వద్ద మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జరిగింది. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర, సూత్రాలను మహిళలకు తెలియప రచడానికి మహిళా సదస్సు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు ఎండీ సుజావుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం డి కాజం అహ్మద్, కమిటీ సహాయ కార్యదర్శి అబ్దుల్ గఫ్ఫార్ చౌదరి, కమిటీ సభ్యులు అమీరుద్దీన్, అస్గ ర్ అలీ, ముజహిద్, మొయిజ్ ,షఫీ, కరీం,ఫసి, మౌలానా షోయిబ్ ఉర్ రహమాన్ పాల్గొన్నారు .

# కార్పొరేషన్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి





**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 10 :** మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం పదవీకాలం మే నెలతోనే ముగిసిందనీ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం వెంటనే ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. సుందరయ్య భవన్‌లో నిర్వహించిన పార్టీ డివిజన్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. నగరంలో పూర్తిస్థాయి పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు న్నారని, అభివృద్ధి పనులకు నిధులు లేక అంతర్గత రోడ్ల వెడల్పు, తీగల వంతెన, వాల్ ప్రాజెక్టు పనులు పెండింగ్‌లో పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు పరిహారం అందించి, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడేది సీపీఎం అని, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం



**ముద్ర, మోత్కూర్:** 70వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ మోత్కూర్ మండల స్థాయి అండర్ 17 బాలుర బాలికల క్రీడోత్సవాలు మోత్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయుడు దేవినేని అరవింద రాయుడు సభా అధ్యక్షతన నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి మండల విద్యాధికారి సత్యనారాయణ, సీఐ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడ తాయని విద్యతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ దబ్బేటి శైలజ ,పి ఆర్ టి యు రాష్ట్ర నాయకులు ధర్మారపు వెంకటయ్య, ఎజిఎఫ్ మండల సెక్రెటరీ చిరుమర్తి యాదయ్య, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కొరటి కంటి వెంకటరమణ, పి ఈ టి లు బొమ్మన మల్లేష్ ,రేపాక రమేష్, జ్ఞాన సుందరి తదితరులు పాల్గొన్నారు.

# అనుమానంతో భార్య దారుణ హత్య

### కారులో మృతదేహంతో నిందితుడు, ఖమ్మంలో కలకలం





**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 10 :** నగరంలో ఒక దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కుటుంబ కలహాలు, అనుమాన పెనుభూతం ఒక మహిళ ప్రాణాలను బలితీసుకుంది. ఇల్లెందుకు చెందిన మేడిపల్లి విద్యాసాగర్ అనే కారు డ్రైవర్ తన మొదటి భార్యకు విడాకులు ఇచ్చిన తర్వాత నాలుగు నెలల క్రితం చిన్నబోయిన రేణుకను రెండో వివాహం చేసుకున్నాడు. వీరిద్దరూ ఖమ్మంలోని సీసీఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివా సముంటున్నారు. అయితే రేణుకపై అనుమానం పెంచుకున్న విద్యాసాగర్ ఆమెతో తరచూ గొడవప డేవాడు.ఈ క్రమంలో బుధవారం సాయంత్రం రేణుకను కారులో బయటకు తీసుకువెళ్లిన విద్యాసాగర్, ప్రయాణంలోనే మళ్లీ వివాదానికి దిగాడు. తీవ్ర ఆగ్రహానికి లోనై కారులోనే భార్య గొంతు నులిమి అత్యంత దారుణంగా హత్య చేశాడు. అనంతరం భార్య మృతదేహాన్ని కారులోనే ఉంచుకుని, తాను కూడా చనిపో తున్నట్లు ఇల్లెందులోని తన స్నేహితుడికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఆందోళన చెందిన స్నేహితుడు వెంటనే రఘునాథపాలెం సీఐకి సమాచారం అందించాడు.రం గంలోకి దిగిన పోలీసులు ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితుడి ఆచూకీని పసిగట్టారు. ఖమ్మం-ఇల్లెందు రోడ్డులోని ప్రగతి స్కూల్ సమీపంలో నిలిపి ఉంచిన కారు దగ్గర విద్యాసాగర్‌ను గుర్తించి, రాత్రి 10.30 గంటల ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. కారులోని రేణుక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేణుకను ఎక్కడ హత్య చేశాడు, మృతదేహంతో ఎంత దూరం ప్రయాణించాడు అనే కోణాల్లో ఖమ్మం అర్బన్ పోలీసులు ప్రస్తుతం విచారణ జరుపుతున్నారు.

## లోబీపీ : కొద్దిగా ఉప్పు ఉన్న ద్రవాలు



బీపీ తక్కువగా ఉన్నప్పుడు కొందరికి సోడియం పెంచడం ఉపయోగ పడొచ్చు. కానీ అధిక ఉప్పు ఆరోగ్యానికి హానికరం కాబట్టి వైద్యుల సూచనతోనే తీసుకోవాలి.

# రైస్ మిల్లర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**స్పందించకుంటే నేటి నుంచి రాష్ట్రవ్యాప్త బంద్**

**రైస్ మిల్లర్ల వెల్ఫేర్ అసోసియేషన్ మహాధర్నా**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** రైస్ మిల్లర్ ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మెదక్ కలెక్టరేట్ ముందు జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జిల్లాలోని బాయిల్డ్, రా రైస్ మిల్లర్లు, హమాలీలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. మెదక్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తొడుపునూరి చంద్రపాల్ మాట్లాడుతూ....ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 11 నుండి రాష్ట్ర వ్యాప్తంగా బంద్ పాటిస్తామని హెచ్చరించారు. రైస్ మిల్లర్లపై విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ దాడులను వెంటనే నిలిపివేయాలని, కేసులు, జైలు శిక్షలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీఎంఆర్ ఒప్పందాన్ని ఇరు పక్షాలకు ఆమోద యోగ్యంగా మార్చాలని, ధాన్యాన్ని టెస్ట్ మిల్లింగ్ చేసి ఖరీఫ్, రబీలకు వేర్వేరుగా అవుట్ టర్న్ రేషియో నిర్ణయించాలని డిమాండ్ చేశారు. 2014 నుంచి పెండింగ్లో ఉన్న మిల్లింగ్ చార్జీలు, ట్రాన్స్పోర్టు, డ్రైయేజ్, కస్టోడియన్ చార్జీల బకాయిలు విడుదల చేయాలని కోరారు. మిల్లర్లపై విధించిన 25 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీని పూర్తిగా మాఫీ చేయాలన్నారు. రైస్ మిల్లులకు 200 హెచ్పీ వరకు ఎల్ కేటగిరీ ఇవ్వాలని, ప్రస్తుతం భారీగా పెరిగిన విద్యుత్ చార్జీల వల్ల నెలకు కనీసం రూ.80 వేల కరెంట్ బిల్లులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్ ధాన్యానికి మిల్లింగ్ చార్జీ 150 రూపాయలకు పెంచాలని కోరారు.నాణ్యమైన బియ్యం కోసం సార్టెక్స్ మిషన్ల వినియోగంతో అదనంగా 50 హెచ్పీ విద్యుత్ అవసరం అవుతుందన్నారు. ఎఫ్సీఐ విధించిన కఠిన మైన నిబంధనలను మిల్లర్లు ఎదుర్కొంటోన్న వాస్తవిక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని సడలించాలని కోరారు. సీఎం రేవంత్రెడ్డితోపాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఎఫ్సీఐ కఠిన నిబంధనలు సడలించాలిరా రైస్ మిలర్ల సంఘం అధ్యక్షులు వుట్కూరి వీరేశం మాట్లాడుతూ...విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ టాస్క్ ఫోర్స్ ఆకస్మిక దాడులను వెంటనే నిలిపివేసి మిల్లర్లతో ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ ధాన్యాన్ని పూర్తిగా రా రైస్ గా.. రబీ ధాన్యాన్ని పూర్తిగా బాయిల్డ్ రైస్ గా ప్రభుత్వం స్వీకరించాలన్నారు. ఈ ధర్నాలో నాయకులు రేఖా వెంకటేశం, ఇమ్మడి లక్ష్మణ్, సంతోష్ రెడ్డి, జగదీశ్వర్, తొడుపునూరి శివరామకృష్ణ, శంకర్, అశోక్, వేణు, శివన్న తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపు**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** మట్టి గణపతిని పూజిద్దాం... పర్యావరణాన్ని పరిరక్షిద్దామని కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు మట్టి గణపతి ప్రతిమలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలు పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, నదులు మరియు ఇతర జల వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా జల వనరుల పరిరక్షణకు తోడ్పడటంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. పండుగ ప్రశాంతంగా సంప్రదాయబద్దంగా జరుపుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటు, విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ... గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వేడుకలను నిర్వహించాలని సూచించారు. .ఈ సమావేశంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ డాక్టర్ మాధురి, ఆర్డీవోలు రమాదేవి, బావయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. బ్యాంకులు రుణ లక్ష్యాలను సాధించాలి ఆర్థిక వృద్ధి రేటులో మెదక్ జిల్లా దూసుకుపోతుందని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో నిర్దేశించుకున్న రుణ లక్ష్యాలను చేరుకోవడంలో బ్యాంకర్లు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేశాయని, రూ. 1713.32 కోట్ల రూపాయలు వివిధ రంగాలకు మంజూరు చేయడం విశేషం అన్నారు. జిల్లా స్థాయిలో బ్యాంకర్లతో సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు అందడంలో బ్యాంకులు పాత్ర అత్యంత కీలకం అన్నారు. సమన్వయంతో పనిచేసి 100 శాతం రుణ లక్ష్యాలను సాధించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ, ఆర్బీఐ ప్రతినిధి హేమలత, నాబార్డ్ డీడీఎం కృష్ణ చైతన్య, వివిధ బ్యాంకుల ఏజీఎంలు, అధికారులు పాల్గొన్నారు.

# పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద భారీ ప్రమాదం

**9వ గేటు రోప్స్ తెగడంతో ఘటన**

**8 వేల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగింపు**

**గేటు పునరుద్ధరణకు రంగంలోకి నిపుణులు**



**ముద్ర, కర్నూలు:** కర్నూలు జిల్లా పరిధిలోని అత్యంత కీలకమైన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ప్రాజెక్టు వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. ప్రాజెక్టులోని 9వ గేటు ఒక్కసారిగా తెగిపోయి కిందపడటంతో అక్కడున్న సిబ్బంది, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అధికారులు నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు , పనులు నిర్వహించేందుకు గేటును పైకి ఎత్తుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఊహించని విధంగా గేటు రోప్స్ తెగిపోవడంతో అది అలాగే కిందపడి నిలిచిపోయింది.ఆపరేషన్ లో లేని గేట్లు--- అధికారుల నిర్లక్ష్యం?పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్కు సంబంధించి 1, 2, 9, 10 నంబరు గేట్లను చాలా రోజులుగా సరిగ్గా ఆపరేట్ చేయడం లేదని తెలుస్తోంది. క్రమం తప్పకుండా నిర్వహణ పనులు చేపట్టకపోవడం, చాలా కాలం పాటు ఆపరేషన్లో లేకపోవడం వల్లనే లోహపు రోప్‌లు బలహీనపడి 9వ గేటు తెగిపడి ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రాజెక్టు నిర్వహణ తీరుపై , అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల ప్రమాదం జరిగినప్పటికీ, ప్రస్తుతం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా శ్రీశైలం జలాల తరలింపు కొనసాగుతోంది. ప్రాజెక్టు నుంచి సుమారు 8 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం దిగువకు ప్రవహిస్తోంది. ఈ హెడ్ రెగ్యులేటర్ ఆధారంగా కేసీ కెనాల్, ఎస్ఆర్బీసీ (SRBC) , తెలుగు గంగ కాలువలకు నీటి విడుదల నిరంతరాయంగా సాగుతోంది.అప్రమత్తమైన జల వనరుల శాఖ అధికారులుగేటు తెగిపడిన విషయం తెలిసిన వెంటనే నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, ప్రాజెక్టు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నీటి ఉధృతి వల్ల ఎలాంటి అదనపు ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. తెగిపోయిన 9వ గేటును పునరుద్ధరించేందుకు , ఇతర గేట్ల భద్రతను పరిశీలించేందుకు నిపుణుల బృందం రంగంలోకి దిగింది.

# ‘సర్’ ఫిర్యాదులు వచ్చే ఎన్నికల నాటికి పరిష్కరిస్తాం

**సీఈసీ కీలక వ్యాఖ్యలు**



**ముద్ర, ఢిల్లీ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. SIR ప్రక్రియలో ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించడంపై వచ్చిన ఫిర్యాదులను వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి 110 శాతం పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గుజరాత్‌లో రెండు రోజుల పర్యటనలో ఉన్న జ్ఞానేశ్ కుమార్.. గురువారం అహ్మదాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో మాటాడారు. SIR ప్రక్రియలో వేలాది ఫిర్యాదులు వస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి వాటిని పరిష్కరించగలరా? అని ప్రశ్నించగా.. “110 శాతం” అని జ్ఞానేశ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ గతంలో కూడా 2003-04లో నిర్వహించినట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో గైర్హాజరైన వారు, వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు, మరణించిన వారు, డూప్లికేట్ ఓటర్లు, విదేశీయుల పేర్లను తొలగించి జాబితాను ప్రక్షాళన చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని చెప్పారు.పౌరసత్వానికి పత్రాలే ఆధారంవిదేశీయుల అంశంలో ఎన్నికల సంఘం పత్రాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటుందని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. భారతీయులమని నిరూపించుకోవడానికి సంబంధిత పత్రాలు లేదా తల్లిదండ్రుల పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. అర్హతకు సంబంధించిన విషయంలో ప్రధానంగా రెండు పరిస్థితులు ఉండొచ్చని అన్నారు. ఒకరికి అవసరమైన పత్రాలు లేకపోవడం లేదా వారు విదేశీయులు కావడం వంటి అంశాలను పరిశీలించాల్సి ఉంటుందని వివరించారు.పేరు లేకపోతే ఏం చేయాలి?ఓటర్ల జాబితాలో పేరు లేకపోతే సంబంధిత వ్యక్తి సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అక్కడ ఫిర్యాదు తిరస్కరణకు గురైతే జిల్లా కలెక్టర్ దగ్గర అప్పీల్ చేసుకోవచ్చని చెప్పారు. ఆ తర్వాత రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ దగ్గర రెండో అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, అవసరమైతే చివరికి కోర్టును కూడా ఆశ్రయించవచ్చని వివరించారు. ఇప్పటికే సుమారు 12 రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో పేర్ల తొలగింపుపై ఒక్క అప్పీల్ కూడా రాలేదని జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియను తాను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. విమర్శలను స్వీకరించాల్సిందే.. ఎన్నికల సంఘంపై వస్తున్న తీవ్ర విమర్శలపై కూడా CEC స్పందించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ విమర్శించే హక్కు ఉందని అన్నారు. “ప్రతిరోజూ వచ్చే విమర్శలను స్వీకరించేందుకు మనం మరింత బలమైన భుజాలను కలిగి ఉండాలి” అని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘంపై విమర్శలకు ఏదైనా పరిమితి విధించాలా? అనే ప్రశ్నకు.. దానికి గీత గీయడం సాధ్యం కాదని చెప్పారు. ఎన్ని గీతలు గీసినా వాటిని ఎవరైనా దాటుతారని, విమర్శలను స్వీకరించడంలో తప్పేమీ లేదని అన్నారు.ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికలుభారత్ ఎన్నికల వ్యవస్థ అత్యంత విస్తృతమైన, పారదర్శకమైన వ్యవస్థ అని జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. రాజ్యాంగం, ఎన్నికల చట్టాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 90 కోట్ల మంది ఓటర్లతో లోక్‌సభ ఎన్నికలను నిర్వహించడం ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ అని చెప్పారు. సాధారణ ఎన్నికల సమయంలో సుమారు 1.8 కోట్ల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటారని తెలిపారు. ఓటర్ల జాబితా తయారీ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు వివిధ దశల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రతినిధులు పాల్గొనడం భారత ఎన్నికల వ్యవస్థ ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు. ఈవీఎంలను హ్యాక్ చేయడం సాధ్యం కాదని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు కాలిక్యులేటర్ల మాదిరిగా పనిచేస్తాయని, అవి ఇంటర్నెట్, వై-ఫై లేదా బ్లూటూత్‌కు అనుసంధానం కావని తెలిపారు. అందువల్ల వాటిని హ్యాక్ చేయడం సాధ్యం కాదని జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు.

## చాకలి ఐలమ్మకు నివాళి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చెరగని ముద్ర వేసిన గొప్ప మహిళా యోధురాలని అన్నారు. సామాజిక అన్యాయం, జమీందారీ వ్యవస్థ, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడి అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను చైతన్య పరిచే పాటకు చట్టసభల్లో ప్రాతినిథ్యం కల్పించాలి



**సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి**

**భువనగిరి లో ఏపూరి సోమన్న "25 ఏండ్ల పాటల ప్రవాహం" సభ**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజలను చైతన్య పరిచే పాటకు చట్టసభల్లో ప్రాతినిథ్యం కల్పించాలని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి అన్నారు. ప్రజా కళాకారుడు, ప్రజా యుద్ధనౌక ఏపూరి సోమన్న పాటకు 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా గురువారం భువనగిరిలో ఏ ఆర్ గార్డెన్ లో పాటల ప్రవాహం సభ నిర్వహించారు. ఈ సభకు ప్రజా కళాకారుడు మీసాల గణేష్ అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఏపూరి సోమన్న జీవితంలో సగం జీవితం ప్రజా కళాకారుడిగా ప్రజలను చైతన్య పరిచాడని ఆయన అన్నారు. ఏపూరి సోమన్న సేవలను ప్రజలు గుండెల్లో దాచుకుంటారని ఆయన అన్నారు. ప్రజా కళాకారులకు చట్టసభల్లో ప్రాతినిథ్యం కల్పించాలని ఈ సభ ద్వారా ప్రపంచానికి పరిచయం చేయాలని ఆయన అన్నారు. ఏపూరి సోమన్న చట్టసభలకు వేళ్ళే వరకు మనమంతా సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏపూరి సోమన్న పాటకు "25 ఏండ్ల పాటలు ప్రవాహం" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు బట్టు రామచంద్రయ్య, కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు జేరిపోతుల పరుశురాం, జిల్లా అధ్యక్షులు కొడారి వెంకటేష్, ఎం ఆర్ పి ఎస్ జిల్లా నాయకులు చిలుకమారి గణేష్, ఐ లు జిల్లా అధ్యక్షులు బొల్లేపల్లి కుమార్, కవి బైరపాక స్వామి, కళాకారులు ఎర్ర సూర్యం ,మహిళా కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి




**ముద్ర, మోత్కూర్:** గణేష్ ఉత్సవాలు–2026 సందర్భంగా గురువారం స్థానిక ఆర్యవైశ్య భవన్ లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.సమావేశానికి గణేష్ ఉత్సవ నిర్వాహకులు,శాంతి కమిటీ సభ్యులు హాజరయ్యారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠ, ఊరేగింపు,నిమజ్జనం కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు స్థానిక సీఐ వెంకటేశ్వర్లు అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గణేష్ మండపాల వివరాలను పోలీస్ శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి.మండపం ఏర్పాటు చేసే స్థలానికి సంబంధించి అవసరమైన అనుమతులు తీసుకోవాలి.మండపాలు, ఊరేగింపుల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలని ప్రమాదాలు జరగకుండా అందరూ పోలీసుల సూచనలు పాటిస్తూ, శాంతి, సామరస్యాన్ని కాపాడుతూ మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గణేష్ ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్షాల అలర్ట్..

**మూడు రోజులు జాగ్రత్త**

**ముద్ర, హైదరాబాద్:** ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం మారనుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అల్పపీడనం రానున్న 24 గంటల్లో వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని పేర్కొంది.ఏపీలో ఆరెంజ్ అలర్ట్ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. విశాఖపట్నం, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఆయా ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలుఅల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేని ప్రయాణాలను వీలైనంత వరకు తగ్గించుకోవాలని అధికారులు సూచించారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555